
జూలై 1973

46

సృజన

ఆధునిక సాహిత్య వేదిక



నిర్వహణ

'సాహితీ మిత్రులు'

రు. 1

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

46

జూలై 1973

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

68 పేజీలు 1 రూపాయి

ముఖచిత్రం: అమరజీవి ఎన్. ఎస్. ప్రకాశరావు

విడిప్రతి: ఒక రూపాయి
అర్ధసంవత్సర చందా: ఆరు రూపాయలు
సంవత్సర చందా: పది రూపాయలు

ప్రతులకు, వివరాలకు: సృజన, హనుమకొండ, వరంగల్ 506001.

వెలువడింది

మావో-సే-టుంగ్
మహత్తర శాస్త్రీయ తాత్విక రచన

వైరుధ్యం

వెల: 80 పైసలు

రాబోవు ప్రచురణలు:

రక్తాశ్రువులు	డాక్టర్ బెతూన్ జీవిత చరిత్ర
ఆచరణ	మావో-సే-టుంగ్
అధ్యయనం	మావో-సే-టుంగ్
ఉప్పెన	చౌలి-పో
చైనా అరుణతార (రివైజుడు ప్రతి)	ఎడ్గార్ స్నో

ప్రచురణ: సి. కె. నారాయణరెడ్డి
6-3-628/13, ఖైరతాబాదు, హైదరాబాదు-500004

ప్రతులకు: సృజన, హనుమకొండ, వరంగల్-506001

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J. P. N. Road, Warangal-506002 (A. P.)

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

1973 జులై — మాసపత్రిక 46

ఎస్. ఎస్.

సామాన్యులు చావునుంచి తప్పించుకోలేమని తెలిసికూడ చావుకువెరచి బతుకును సాహసంగా మలచుకోలేరు. సాహసికుల జీవితంలో చావు ఏక్షణం లోనయినా సహజమైన సంఘటన. ప్రజలపట్ల, పీడితులపట్ల ప్రేమతో సమాజంమీద శాస్త్రీయ ప్రయోగాలుచేసే అన్వేషకులు యవ్వనంకన్నా చావును, సౌఖ్యంకన్న త్యాగాన్ని, భద్రతకన్న బలిదానాలను కావాలని ఎంచుకుంటారు- ముందుతరాలు సుఖంగా, క్షేమంగా బతకాలని. వాళ్ళకు విప్లవకారుడుగా జీవించడం గొప్ప విషయం. విప్లవకారుడుగా మరణించటం అన్నిటికన్న గొప్ప విషయం.

ఎస్ ఎస్ విప్లవ రచయితల సంఘ సభ్యుడుమాత్రమేకాదు విరసం పుట్టుకకు దారితీసిన విశాఖ విద్యార్థుల సవాల్‌లో భాగం. సమాజంలో రచయిత పాత్రపట్ల మార్క్సిస్ట్ లెనినిస్ట్ అవగాహనతో మసలుకున్నవాడు. మావో ఆలోచనావిధానమంటే శాస్త్రీయ ఆచరణకు, పీడితప్రజల విముక్తికి బాటలు వేసే దీర్ఘకాలిక సాయుధ పోరాటాలకు స్పష్టమైన రూపమని నిశ్శంసయములుడు లేకుండా నమ్మినవాడు. ఆయనకు విప్లవ రచన, విప్లవ కార్యాచరణ వేరు వేరు అరలు కావు. వ్యాసాల్లో సూటిదనం, కథల్లో వ్యంగ్యం, మాటల్లో ప్రవాహం, చూపులో వైశాల్యం, మనసులో మంచితనం, వయసులో వేడి, చేతల్లో వాడి- ఎస్.ఎస్. ఒక్కమాటలో ఎస్.ఎస్. ఆదర్శవిద్యార్థి. యువ తరం గర్వించదగిన రచయిత. 'ఉప్పెన' అనువాదం విప్లవ సాహిత్యంలో ఆయనకొక శాశ్వతస్థానాన్ని సాధించి పెట్టింది. ఈ దేశానికి ఆ నవల అవసరాన్ని గుర్తించి, పేర్లుమాత్రం మార్చకుండా యీ దేశ వాతావరణాన్ని, విశాఖ మాండలికాన్ని సజీవంగా తెచ్చి అనువాదాన్ని ఒరిజినల్‌వలె అనుభూతి చెందేలా చేసాడు. సగంలోనే ఆగిపోయిన ఈ అనువాదం సృజన పాఠకులకు ఎస్.ఎస్. లేనిలోటు ఎప్పటికీ గుర్తు చేస్తుంది.

— సంపాదకుడు

ఎస్. ఎస్. ప్రకాశరావ్!!

విషారా

నువ్వు లేవు
నవ్వులు చిందించేవ్
నువ్వు లేవు
పువ్వులు అందించేవ్
నువ్వు లేవు
పువ్వుల నవ్వించిన
నవ్వులు పూయించిన
నువ్వు లేవు
కథలెన్నో పండించేవ్
కలలెన్నో సృష్టించేవ్
మెరుపులు మెరిపించేవ్
ఆశలు చిగురించేవ్

నువ్వు లేవు
ఆశలన్నీ తుంచేసేవ్
తెంచేసేవ్
మెరుపులా మాయమయేవ్
నువ్వు లేవు
చిలకలోని సొగసులా
మల్లెపూల తెలుపులా
మందారపు ఎరుపులా
పసిపాపల నవ్వులా
నిన్న మురిపించిన
నువ్వు మాకు

నేడు లేవు
నువ్వు లేవు
అవునయ్యో నువ్వు లేవు
పావురాల వీధిలో
డేగలు
కోయిలమ్మ గూటిలో
పాములు
ఉంటాయని మాకు చెప్పి
అదేవిధంగా
మనిషి బతుకు మధ్య
దేముడు
ఉంటాడని మాకు చూపి
వెళిపోయేవ్

నువ్వు లేవు
నీటిలోని పిల్లచేప
నిప్పులోకి నడిచినట్టు
పెళ్ళినాటి పూలమాల
మంటలోకి ఉరికినట్టు
తీగచివరి సన్నజాజి
పిడుగుదెబ్బ కొరిగినట్టు
అలనాడు
శ్రీరంగం చిన్నవాడు
నూతిలోకి పోయినట్టు

నిప్పుల కుంపటిపై
ఇనపరాతి మూకుట్లో
వెన్నంతా వేగినట్టు
మధువంతా మాడినట్టు
అయయో నువ్వయిపోయేవ్
హాయ్యో నువ్వులేవు
నువ్వు లేవు
నువ్వు లేవు
అయ్యయ్యో నువ్వు లేవు
ఈలోకంలో
నువ్వే లేవంటే
ఇక
ధర్మానికి తావులేదు
న్యాయానికి నీడలేదు
దైవానికి గుండెలేదు
నువ్వు లేవు
నవ్వుల రాజ్యంలో
పువ్వుల పంటవి నువ్వు
అనుకోకుండా
అకస్మాత్తుగా
పాముల పట్నంలో
పావుర పిట్టవయేవు
దెబ్బకి దొరికిపోయేవు
కోరకి చిక్కిపోయేవు
కాని
నళినీ ప్రకాశమా
వళ్ళంతా కాలిపోయి
రెండు రెక్కలు మండిపోయి
కళ్లురెండూ మాడిపోయి
ఏదేమైనప్పటికీ
పెనుపులితో
పిగిలిపిట్ట పోరాడినట్టు
పాపపు మృత్యువుతో
నువు సల్పిన
భీకర పోరాటం
అది
నువు మాకిచ్చే సందేశం
నీ సమరం
నీ సందేశం
మాకాదర్శం

కాలిన మరుక్షణంలో
కాయితమ్మీద కలంపెట్టి
కావలసిన వారందరికీ
సందేశాలందించిన
నీ మనోధైర్యం
నీ గుండె నిబ్బరం
మాకాదర్శం

ఎన్నెన్ ప్రకాశమా
నువ్వు లేవు
నీ చల్లని చూపులేదు
నీ వెన్నెల నవ్వు లేదు
నీ పువ్వుల బాసలేదు
నీ మెత్తని మనసులేదు
నీ జాలి జాలి గుండె లేదు

కాని
నీ ధైర్యం
నీ సాహసం
నీ సమరం
నీ సందేశం
మాకున్నాయి
అయయో ప్రకాశమా
అయ్యారే ప్రకాశమా

యుపకెరటం విరగదు

జ్యోతి

ఇక్కడ ఆకాశం పందిరికింద
ఆచరణ-అవరోధాలమధ్య
నీతో గడిపిన రెండే రెండుదినాలు
క్షణక్షణం మరువలేకున్నా ఎస్. ఎస్.
గుండె ధైర్యం, నిండునవ్వు
నిండిన నువు నడిచిన స్థలం.

ఎక్కడి చుక్కలు అక్కడే పడివున్నాయి
గాలి మామూలుగానే వీస్తోంది
దోపిడీ మజాగానే సాగుతోంది
సిద్ధాంతాన్ని చీల్చి
రంగస్థలంమీద ఎగరాలనేవాళ్ళ
సిద్ధాంతాన్ని విప్లవించి

రణరంగంలో దూకాలనేవాళ్లూ
వాళ్లకీ, వీళ్లకీ మధ్య
ఊగిసలాడే వంచనాపరులూ
అటు రాజకీయ రంగంలోనూ
ఇటు రచయితల సంఘాల్లోనూ
పైదొలగలేదు ప్రకాశ్
ఇంకా నీ మార్గం సుగమం కాలేదు ఎస్. ఎస్.
మరణాన్ని ధిక్కరించాలన్న మానవుడివి
'మంచి'దారిన నెత్తుర్లు చిందినా నడవాలన్నవాడివి
మనిషిగా నువ్వెత్తిన సిద్ధాంతం బందూకుతో
'ఉప్పెన'లా విజృంభించాలన్న సోదరుడవు
వర్గరహిత సమాజంకొరకు-
ప్రకాశ్ నీ ఆచరణ
విప్లవ పథపురోగామి వర్గాలకి ప్రేరణ.

అవును ప్రకాశ్ విప్లవం ముందుపంక్తిలో
నిలబడి ప్రజలకి మేలుచేసేవాణ్ణి
ఉద్యమం మధ్యలో నిలబడి
సిద్ధాంత శంఖారావం చేసేవాణ్ణి
ఈ బూర్జువా ప్రపంచం ఎప్పుడు బతకనిచ్చిందని
ప్రకాశ్
నువ్వంటించిన విప్లవం మంటల్లో
నువ్వెలుగెత్తి చాటిన విరసం పథంలో
మేం ఎప్పుడూ వుంటాం
నీ ఆచరణ ధ్యేయంగా సాగిపోతాం.

నాటిక :

టెంపరరీ లేబర్

చెరబండరాజు

(ఫ్యాక్టరీ ఆఫీసు)

(గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ పెద్దసైజు క్యాలండర్లు ఎదురు గోడకు వేలాడుతుంటాయి. అప్పుడప్పుడు కళ్లద్దాలు సర్దుకుంటూ యజమాని రామనాథం ఏదో రాసుకుంటూ వుంటాడు. పక్కనే ఫోను, ఫైళ్లు. అతనికి కొంచెం ఎడంగా చిన్న టేబుల్ ముందు ముసలి గుమాస్తా ఫైళ్లలోకి ముఖందూర్చి చిరాగ్గా వెదుకుతూ వుంటాడు. వో మూలకు బీరువా తెరిచివుంటుంది. అందులోనూ వెతుకుతుంటాడు. రామనాథం టేబుల్‌మీద ఖాళీ కోకకోలా సీసా. ఒక ప్రక్కన కుర్చీ. బయటికి ఒకే ద్వారం.)

రామనాథం: (రాయటం ఆపి సిగరెటు ముట్టిస్తూ) సుబ్బారావ్! ఇంకా ఎంత సేపు?

సుబ్బారావు: (వులికిపడి) అయ్యా! (వెతుకుతూనే వుంటాడు)

రా.నా: ఎంత సేపాంట?

సు.రా: అయిపోయిందండీ.

రా.నా: ఊఁ! త్వరగా కానియ్. దాహం చంపేస్తుంది. కాస్త మంచినీళ్లు తెచ్చిపెట్టు.

సు.రా: (అతి వినయంగా) ఇప్పుడేనండి. (పక్కకివెళ్లి తెచ్చి టేబుల్‌మీద పెడతాడు)

రా.నా: (టై సర్దుకుంటూ లేచి) సుబ్బారావ్!

సు.రా: (చేతులుకట్టుకొని) అయ్యా!

రా.నా: (బయటిద్వారంకేసి చూస్తూ) కేశవులు ఇంకా వత్తాలేదు.

సు.రా: (మళ్లీ ఫైళ్లుచూస్తూ) ఏ కేశవులండీ? చిన్న కేశవులా పెన్న కేశవులాండీ?

రా.నా: నా ముఖం కేశవులు. అదేనయ్యా యూనియన్ నాయకుడు.

సు.రా: ఆయనాండీ! తప్పకుండా వస్తారండీ. రాత్రి గంటన్నర ఎదిరిచూసి, చివరకు ఎలాగో పట్టుకొని మీరు రమ్మన్నారని మరీమరి చెప్పానండి.

రా.నా: చెప్పావయ్యా. ఇంకా ఎందుకురాలేదా అని...

సు.రా: నాయకుడుగదండి. ఈ నాయకుడు ఇంకో పెద్దనాయకుణ్ణి కలవాలాయె. సంప్రదింపులూ జరగాలాయె అయ్యా! మన ఎత్తు పారాలంటే మాటలాండీ?

రా.నా: (కూర్చుంటూ) అన్నట్టు సుబ్బారావ్!

సు.రా: అయ్యా! ఫైలు చూస్తున్నానండి.

రా.నా: చూస్తున్నావు సరేనయ్యా. నాకోవిషయంచెప్పు (లేచి) ఇప్పుడొచ్చిన యూనియన్ ఎంతకాలం నిలుస్తుందంటావ్? ఈ కొత్తయూనియన్‌తో రెండుగదా మన ఫ్యాక్టరీలో యూనియన్‌లు.

సు.రా: రెండుగాదండి. (చిరాగ్గా తనలోతానే) వెధవఫైలు దొరకనే దొరకదు. అయ్యా! రెండుగాదండీ, మూడు. ఇంకేమున్నాఅంటే నాలుగవుతాయి. ఒకటి కాంగ్రెసు మినిష్టరు యూనియన్.

రా.నా: అయితే ఫర్వాలేదు. అది మన ఇంటికుక్కలాంటిదే.

సు.రా: రెండు. ఈ వూళ్లోవున్న పెద్ద కోటేశ్వరుడిదండీ.

రా.నా: మనకూ, ఆయనకూ వ్యాపారరీత్యా మంచి సంబంధాలే వున్నాయ్. ఇంక,

సు.రా: మూడు కమ్యూనిస్టుల్దండీ.

రా.నా: అంటే– అదే మన ఫ్యాక్టరీ గోడలమీద రాసాడుచూడు. ఢిల్లీచలో కమ్యూనిస్టులు. వాళ్లేనా?

సు.రా: ఢిల్లీచలో కమ్యూనిస్టులు (నవ్వి) గమ్మత్తుగా వుందండీ, అంతేగాదండి వాళ్లకు తెల్ల కమ్యూనిస్టులు అనికూడా పేరుందండీ.

రా.నా: మనకిక భయమే అక్కర్లేదు. అంతా మనవాళ్లే మన చుట్టాలే. మన బంధువులే(ఆగి)అన్నట్టూ ఢిల్లీచలో, పార్లమెంటుకు చలో తప్పిస్తే, ఈ కమ్యూనిస్టులకు అంతకంటే పనేం వుండదా?

సు.రా: కానండీ–

రా.నా: ఇంకా ఏమిటి?

సు.రా: అవేనండీ. అది... అది...

రా.నా: ఏదీలేదుగానీ... సుబ్బారావ్!

సు.రా: అయ్యా!

రా.నా: ప్రపంచ కార్మికులారా ఏకంకండి అంటారే కార్మికులు. మరి కాంగ్రెసు కార్మికులు, ఇందిరా కమ్యూనిస్టు కార్మికులు, సేటు కార్మికులు, ఇన్నిరకాలుగా ఎలా వుంటారయ్యా! వాళ్ల నాయకులకు పడదే.

సు.రా: పడదండీ.

రా.నా: పార్టీలకుపడదు.

సు.రా: పదదండీ.

రా.నా: ఎప్పుడూ ఒకర్నొకరు తన్నుకుంటూ వుంటారాయె.

సు.రా: అవునండీ.

రా.నా: తన్నుకోవడమేమిటి. ఆమధ్య చాకుల్తో పొడుచుకున్నారుకూడా.

సు.రా: తమరిదయ అయ్యా! తమకు తెలియందేముందీ (ఆగి) ఈ ఫ్యాక్టరీకి తమరు యజమానులు. మంచివాళ్లలోకెల్లా మంచి యజమానులు. అట్లాగే కార్మికులకుగూడా మంచి మంచి యజమానులైన నాయకులున్నారండి. అయ్యా! ఇటు వుత్పత్తి, అటు జీతాలు. అటు సమ్మెలూ, ఇటు రూల్సూ. ఇటు చీలికలు, అటు ఐకమత్యం. అన్నీ యాజమాన్యంనుండే గదండీ పుట్టుకొస్తాయి. మీరు చల్లగా చూస్తే, కొత్త కొత్త యూనియన్‌లు ఎన్నైనా వస్తాయండి. అవి ఎంత ఎక్కువైతే మనకంతలాభం గదండీ.

రా నా: బాగా చెప్పావయ్యా.

సు.రా: అయ్యా! కార్మికులకు కొన్ని పడికట్టుపదాలున్నాయి చూడండి. అవే శ్రమ, శ్రమవిలువ, అదనపు లాభం, బోనస్, న్యాయమైన హక్కు, వైద్య సదుపాయం. ఇవి అందరిసమస్యలూ కాబట్టి, అయ్యా! చెప్పలేం. వీటికారణంగా ఎప్పుడో ఒకప్పుడు అందరూ ఒక్కటవుతారండి.

రా.నా: హుఁ! ఒక్కటి. కార్మికులు ఒక్కటికావడం ఇక్కడ కలలోనిమాట సుబ్బారావ్. కేశవుల్లాంటి నాయకులు, సేటువంటి యూనియన్ యజమానులు, అటు కాంగ్రెసురాజ్యం వున్నంతవరకు వారెప్పుడూ ఒకటికారు సుబ్బారావ్. కావాలంటే నామాట (సుబ్బారావ్ ఛాతీమీద చరిచి) గుండెలమీద రాసుకో.

సు.రా: అంతే. అంతేనండి. కాకపోతే కేశవులును వొట్టిగనే పిలిపించరుగదండి. కాని అయ్యా!

రా.నా: ఏమిటి సుబ్బారావ్?

సు.రా: ఆఁ అదే. అదేనండి. ఇప్పుడు గుర్తొచ్చిందండీ.

రా.నా: ఏమిటది?

సు.రా: అదేనండి. నేను విన్న విషయం చెప్తున్నానండి. ఈమధ్య మన ఫ్యాక్టరీ కార్మికులు బాగా రాజకీయాలు చర్చించుకుంటున్నారండి.

రా.నా: అంతే! సుబ్బారావ్!

సు.రా: అయ్యా!

రా.నా: వాళ్ల నాయకులు కార్మికులకు రాజకీయాలు అవీ చెప్పనే చెప్పరంటావా?

సు.రా: అయ్యా! అంతేనటండీ. అయిదారురూపాయల ఆర్థికపోరాటాల్లోనే కార్మిక శక్తిని తాకట్టు పెట్టారుటండీ. అయ్యా! ఇవన్నీ నేను విన్నమాటలేనండీ. దేశంలో రైతులు దొరికిందల్లా అందుకొని తిరగబడి పోరాడుతున్నారట. దాని తాలూకు కరపత్రాలేనేమో— రహస్యంగా కార్మికుల చేతులు మారుతున్నాయి. అంతేగాదండీ. ఆ యూనియన్ మనుషులు ఈ యూనియన్‌లోకి, ఈ యూనియన్ మనుషులు ఆ యూనియన్‌లోకి చాలా గమ్మత్తుగా మారుతున్నారండి. చివరికొస్తే, ఒక్కోసారి ఏ యూనియనూ లేనట్టే అనిపిస్తుంది. ఎవరిమానాన వాళ్లు పొయ్యేవాళ్లు గుంపులు గుంపులుగా వెళ్తున్నారీమధ్య. నా అనుమానం వాళ్లంతా ఆ సాయుధపోరాటానికి మద్దతిస్తున్నారేమోఅని.

రా.నా: (అరుస్తూ) సుబ్బారావ్!

సు.రా: అయ్యా.

రా.నా: అట్లాంటిమాటలు నాదగ్గర చెప్పకు. ఎక్కడగండికొట్టాలో నాకు బాగాతెలుసు.

సు.రా: అయ్యా తెలుసునండీ.

రా.నా: అందుకేగదా కేశవులును పిలిపించాం.

సు.రా: (ఫైలువెతుకుతూ) చిత్తమయ్యా. దొరికిందండి.

రా.నా: ఏంవిటది?

సు.రా: లిస్టండీ. లిస్టు.

రా.నా: అయితే జాగ్రత్తగాపెట్టు.

(కేశవులు ప్రవేశం)

రా.నా: అదిగో మాటల్లోనే వచ్చేశారు కేశవులుగారు. రండి కేశవులుగారూ. ఇలా కూర్చోండి.

సు.రా: నమస్కారమండి.

కేశవులు: (హడావుడిగా) నమస్కారం. (కూర్చొని) చూడండి రామనాథంగారూ, ప్రెస్సుక్లబ్బులో నాకోమీటింగుంది. ఎక్కువటైంలేదు. త్వరగా తేల్చండి.

రా.నా: సుబ్బారావ్,

సు.రా: అయ్యా! (ఫైలు ఇస్తాడు)

రా.నా: ఇదిగోండి కేశవులుగారూ ఇది టెంపరరీ వర్కర్ల లిస్టు. ప్రొడక్షన్ లేదని

పని మానిపిస్తున్నాను. ఇందులో మీకు కావలసినవాళ్ళు ఎవరో చెప్తే,- ఆ సంగతి నేను తరువాత చూసుకుంటాను.

కేశవులు: (లిస్టుచూస్తూ) అంటే!

రా.నా: అంటే ఏమీలేదు. పని బాగాచేస్తారనో, డాక్టరుఫిట్‌లో నెగ్గారనో, సీనియారిటి వుందనో— అవన్నీ మీకెందుకులెండి. మీ పనల్లా ఒక్కటే. ఫ్యాక్టరీముందు మిగిలిన వర్కర్లు న్యూసెన్స్ చెయ్యకుండా చూసుకోవాలి. అంతే మీపని.

కేశ: పని ఎప్పటినుంచి మాన్పిస్తారు?

రా.నా: (వినిపించుకోకుండా) సుబ్బారావ్! అవి వారికివ్వు. మీరిక్కడో సంతకం పెట్టండి. (కేశవులు టేబుల్‌మీంచి పెన్ను తీసుకొని సంతకం పెడ్తాడు.)

సు.రా: (బీరువాలోంచి రెండు రూపాయల కట్టలుఇస్తాడు)

కేశ: (తీసుకొని చల్లగా) టెంపరరీ వర్కర్లకు హక్కులేమున్నాయిలెండి ఏమున్నా మన చేతిలోపని. ఏమంటారు?

రా.నా: అంతేగదండీ. గడువుదాటకముందే మేలుకున్నానులెండి.

కేశ: (లేచి) మరి నేను వస్తాను.

సు.రా & రా.నా: నమస్తే (కేశవులు నిష్క్రమణ.)

సు.రా: మొత్తంమీద పని సుళువుగా అయిపోయింది.

రా.నా: (లేచి పచార్లుచేస్తూ, డబ్బుఇషారాతో) ఇది! సుబ్బారావు ఇది! ఏకులు మేకులు కాకముందే దేన్నైనా మొగ్గలోనే తుంచెయ్యాల. టెంపరరీ వర్కర్లను ఇట్లా మార్చడంలో మనకు చాలా లాభాలున్నాయి. నిరుద్యోగంతో రోడ్లమీద పహారాఇచ్చే కుర్రాళ్ళు ఫ్యాక్టరీలో అడుగుపెట్టగానే కష్టపడి పనిచేస్తారు. పర్మినెంటు చేస్తామనే ఆశతో మ్యాఁమ్యాఁ అంటూ చెప్పినట్టల్లా వింటారు. పర్మినెంటు చేశామో, నెత్తిమీదికెక్కి కూర్చొని కార్మికుల హక్కులంటూ మొట్టికాయలేయడం మొదలుపెడ్తారు. అంతేనా! ప్రావిడెంటుఫండ్, బోనస్, లోన్, గ్రాట్యుటి, గడ్డీగాదం ఎన్నొస్తాయని. సోమరితనం, యజమాని అంటే భయంలేకపోవడం, పనినాన్చుడూ, బాతాఖానీ, అబ్బబ్బా. అందుకనీ.. (విసుగ్గా వెళ్లి టేబుల్‌మీద వో మూలకు కూర్చుంటాడు.)

సు.రా: వాళ్లు రాస్తుంది కరక్టేనన్నమాట.

రా.నా: ఏమిటది? ఎవరు?

సు.రా: ఫ్యాక్టరీలో వాళ్ల శ్రమశక్తినేగాకుండా, కార్మికుల పునాదుల్ని, చివరకు బతుకుల్నే కూడా దోపిడీ చేయడం అని దీన్నే అంటారట.

రా.నా: (ప్రేమగా) సుబ్బారావూ!

సు.రా: అయ్యా!

రా.నా: (పులిలా టేబుల్‌మీంచిలేచి) యూ షటప్ రాస్కెల్. ఎవరితో మాట్లాడుతున్నావ్. గెటవుట్.

సు.రా: (తటపటాయించి క్యాష్‌బేగ్ తీసుకొని) వస్తానండి బ్యాంక్ టైమ్ ఐపోతుంది. (వెళ్లబోతాడు పిల్లికూనలా)

రా.నా: ఇదిగో! నిన్నే. రాత్రికి ఒకసారి కేశవుణ్ణి కలుసుకొని పొద్దున్నే ఆరుదాటక ముందే మా యింటికిరా.

సు.రా: అట్లాగేనండి. (వెళ్లిపోతాడు)

రా.నా: (నీళ్లుతాగి, సిగరెట్టు ముట్టించి, తాపీగా టేబుల్‌మీదికి కాళ్లుచాచి కూర్చుంటాడు. త్వరత్వరగా అచ్చయ్య, శాయిలు, రాములు లోపలకొస్తారు. రాములు భుజంమీద నెత్తురుగుడ్డలతో భిక్షపతి మూలుగుతుంటాడు.)

రా.నా: (ఆత్రంగాలేచి) అరె! ఏమైందిరాములు? ఎవరీ మనిషి.

రాములు: (ఆపక్కనేవున్న టేబుల్‌మీద భిక్షపతిని పడుకోబెట్టి) మావోడే. ఫ్యాక్టరీ మిషన్లో పడిపోయాడు. అది బాగుచేయించండని ఎంత మొత్తుకున్నా మీరు వింటేగా. అదే భిక్షాలు ప్రాణానికి తెచ్చింది.

రా.నా: అయితే మన లేబరన్నమాట. టెంపరరా? పర్మనెంటా?

శాయిలు: ఫ్యాక్టరీ కార్మికుడు.

అచ్చయ్య: పర్మనెంటు కావాల్సినోడు.

రా.నా: అరెరె! ఎంత అన్యాయం జరిగిపోయింది. పిల్లలున్నారో ఏమో పాపం! అయితే ఇక్కడికెందుకు తీసుకొచ్చారు? నన్నిప్పుడేం చెయ్యమంటారు?

రాములు: ఈని ప్రాణం కాపాడాలి.

రా.నా: అదెట్లాసాధ్యం? పొయ్యేప్రాణాలు కాపాడ్డానికి నేనేమన్నా దేవుణ్నా? దేవుని కొడుకునా? మన ఫ్యాక్టరీ డాక్టర్‌సాబ్‌కు చూపించండి.

శాయిలు: డాక్టర్‌సాబ్! హుఁ ఆయనెందుకుచూస్తడు? ఈ కేసుకు మీ పర్మిషన్ కావాల్నంట.

రా.నా: అదేం ? వాడికేం పొయ్యేకాలం ?

అచ్చయ్య: మనిషీ- టెంపరరీగదా.

రా.నా: అవునవును నిజమే రాములు. మన ఫ్యాక్టరీలో టెంపరరీవాళ్లకు స్థానంలేదు.
(భిక్షపతి గట్టిగా 'అమ్మా అమ్మా' అంటూ మూల్గుతుంటాడు.)

రా: అచ్చయ్యా ! రంగన్ననిపిలువు. చాలా ఆయాసంగా వున్నట్టుంది. ఇక్కడుంటే వాడు బతకడు. పెద్దాసుపత్రికి పంపిద్దాం.
(అచ్చయ్య వెంటనే రంగన్నని తీసుకొస్తాడు. ముగ్గురూ భిక్షపతిని ఎత్తించి పంపిస్తారు.)

రాములు: రామనాథంగారూ ! మీ ఫ్యాక్టరీలో భిక్షపతి అయిదారేండ్లనుండి క్యాజువల్ లేబర్‌గా పనిచేస్తుండు. ఆడిబతుకే క్యాజువల్ అయిపోయింది. వెళ్ళిపొమ్మన్నప్పుడు పోయి, రమ్మన్నప్పుడల్లావచ్చి మీ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి బతుకుతుండు. ఇంకా ఇట్లా ఎంతమందీ ? అయినా వాణ్ని మీరు పర్మినెంటు చెయ్యలేదు. పర్మినెంటు చెయ్యడం మీ వుద్దేశంకాదు. అదికాదు అవన్నీ మీ రూల్సులోలేవు. ఎవరికిరా రూల్సంటే కార్మికులకంటాడు కాని వాటి వల్ల వుపయోగపడేది ఎవరు ?

శాయిలు: (రా. నా.న్నిచూపిస్తూ) మీరు- యజమానులు. భిక్షపతొక్కడేంది. గిట్లశానామందున్రు. మంచి ప్రొడక్షన్‌కి అందరూగావాల. కాని ఫ్యాక్టరీమందులకు నోచుకోరు. పర్మినెంటుకారు. మా కార్మికులబతుకులే టెంపరరీ. మీరూ, మీ ఫ్యాక్టరీ, మీ ప్రొడక్షన్, మీ డబ్బు అన్నీ పర్మినెంటు. మీ లాభాలకు మా నెత్తురుకావాలి. మా ఎముకలిరిగినయంటే బయటికెళ్లగొడ్తరు.

అచ్చయ్య: అరేయ్ శాయిలు. మనం గతజన్మలో పాపాల్‌జేసుకొని పుట్టినంరా. ఇంతమందికన్నంపెడుతుండ్రుగదా ! వాళ్లంతా పుణ్యాత్ములురా.

రా.నా: (వరుసగా ముగ్గురికేసిచూస్తూ) మీరందరూ నా మనుషులయ్యా నా మనుషులు. మీరు లేకపోతే, ఈ ఫ్యాక్టరీ ఎక్కడిది ? ఈ రామనాథం ఎక్కడివాడు ? కాస్త శాంతంగా ఆలోచించండి.

రాములు: (రా.నా. రెండోవైపుకొచ్చి) శాంతం. శాంతం. ఎవడిక్కావాలయ్యా శాంతం ? టెంపరరీ మనుషులు మనుషులుకారు. ఇక పర్మినెంటుమనుషులు మీకు పర్మినెంటు బానిసలు. అంతేగా ! క్యాజువల్ లేబర్‌చేసే కష్టం వాడి

ఏడుపుకే తెలుస్తుంది. అయినా వాళ్లకు జీతాలు పెరగవు. బోనసులుండవు. ఇంక్రిమెంట్లు యివ్వరు. మందులూ దొరకవు. కాని టెంపరరీ వర్కర్లు ఎప్పుడుకావాలి. పర్మినెంటు చెయ్యండీ అంటే ఏవేవోరూల్సు. అట్లాచెయ్యరు. ఇట్లా చెయ్యరు. ఈ యూనియన్‌లూ యజమానులు అందరూకలిసి వర్కర్‌నే కాల్చుకు తింటుండ్రి. అవన్నీ మీరు వొప్పుకోరు.

శాయిలు: రాములూ! మనం పిచ్చోల్లం. అయ్యన్నీ వొప్పుకుంటే మనమిక్కడి కెందుకొస్తంరా?

అచ్చయ్య: అరే శాయిలూ! మందు ఖర్చులు పెట్టుకుంటడో లేదో అడగంట్రా.

రాములు: వాడి ఆపరేషన్ ఖర్చులు మీరే భరించాలి.

రా.నా: (పచార్లుచేస్తూ) అన్నట్టు- మీరు ఏయూనియన్ మనుషులు?

రాములు: మేమంతా కార్మికులం.

శాయిలు: మాదంతా ఒకేరక్తం.

అచ్చయ్య: మేం మనుషులం.

రా.నా: (హేళనగా) మనుషులు! కాని కార్మికులు— అదీ అన్నమాట సంగతి. ఈ మధ్య విప్లవ రాజకీయాలు మీబుర్రలకెక్కాయన్నమాట. అందుకే తెగించొస్తున్నారు. మీతో మాట్లాడ్డం నా బిజినెస్‌కాదు. మేం గుర్తించినయూనియన్ నాయకుడు కేశవులును పిలుచుకురండి. అప్పుడు మాట్లాడుదాం. వెళ్లండి.

రాములు: రామనాథంగారూ! మనిషి చావుబతుకుల్లోవుండు. ఆడిక బతికేది కల్ల. ఇన్నాళ్లూ మీఫ్యాక్టరీలో, ఇవ్వాల్టిదాకా చివరి రక్తపుబొట్టుకూడా ధారపోశాడు. ఆడికి ఏంఇస్తారో చెప్పండి. కాదు. ఇప్పుడే ఇవ్వండి వెళ్లిపోతాం.

రా.నా: కాంపెన్సేషన్ (Campensation) ఇవ్వమంటారు. టెంపరరీ వర్కర్‌కి కాంపెన్సేషన్ చాలా బావుంది. ప్రపంచానికి కొత్తచట్టాలు మీరే రాసేట్టుంది. ఇవ్వన్నీ ఎక్కడ నేర్చుకున్నారు నాయనా?

అచ్చయ్య: మీకు తెలియదా? మా మహానాయకుడు కేశవులుగారిదగ్గర.

శాయిలు: థూ! వాడూ ఒక మనిషేనట్రా?

అచ్చయ్య: (వ్యంగ్యంగా) భిక్షపతి మీ కంపినీ దెబ్బదిన్నందుకు బహుమానం అడుగుతున్నం. ఇస్తారాసార్!

రాములు: రామనాథంగారూ! మేం వచ్చినపని అయ్యేదాక ఇక్కడినుంచి కదలం. (ముగ్గురూ కిందకూర్చుంటారు)

రా.నా: మంచిగా చెప్తున్నారాములు. మీబతుకులుగూడా నాశనమైపోతై. పోలీసులు, కేసులు, కోర్టులు ఇవేం బాగుపడే లక్షణాలుకావు. ఏదో మీకింత యిస్తాను. వెళ్లిపొండి.

శాయిలు: ఇక్కడ కేశవులు ఎవరూలేరు లేవయ్యా.

రా.నా: అయితే ఏంచేస్తారో నేనూ చూస్తాను.

రాములు: అచ్చయ్యా! ఆ డోరుదగ్గర కాపలావుండ్రా. ఏదీ ఎందుకు చెయ్యడో మనమూ చూద్దాం.

(అచ్చయ్య లేచివెళ్లి డోరుకడ్డంగా నించుంటాడు.)

శాయిలు: ఇప్పటికైనా తెలుసుకోండి. గుండాగిరిచేసి మానోరు మూయించలేరు.

(రామనాథం టేబుల్‌బెల్ నొక్కబోతే రాములు వెంటనే అదిలాక్కుని)

రాములు: అంతేగాదు. ఇక మీ మోసాలు సాగవు. ఆ కేశవులుగాడి పప్పులూ ఉడకవు. మనిషికో యూనియన్ పెట్టించి మమ్మెల్నిక చీల్చలేరు. మీ కాళ్లబేరాల కొచ్చే రాజకీయాలుకావు మావి. ఆదశ దాటిపోయింది. చెప్పండి. ఇక్కడ మూడు విషయాలున్నాయి. ఒకటి: భిక్షపతి ఇక ఎలాగూ పనిచెయ్యలేడు. అతనికిబదులుగా అతని పెద్దకొడుకును ఫ్యాక్టరీలో పెట్టుకోవాలి. రెండు: భిక్షపతికి రెండువేల రూపాయలనగదు ఇవ్వాలి. మూడు: టెంపరరీ వర్కర్లందరినీ మూడురోజుల్లో బేషరతుగా పర్మనెంటు చెయ్యాలి. ఇవి వొప్పుకుంటేనే యిక్కడినుంచి కదిలేది.

రా.నా: భయపెడుతున్నారా?

శాయిలు: కాదు భయపడుతున్నం.

అచ్చయ్య: పోలీసయ్యల్ని పిలుస్తావా?

రా.నా: (క్యాలండర్లవేపుతిరిగి) చూడు రాములు. వీళ్లు మన మహానాయకులు. నవభారతనిర్మాతలు. వాళ్లు ఏంచెప్పారో, చెప్తున్నారో నీకేమైనా తెలుసునా? యజమానులకు, కార్మికులకుమధ్య సామరస్యంవుండాలి అన్నారు. ఒకరికొకరు సాయంచేసుకునే ధోరణిలో దేశం ఉత్పత్తి పెంచమన్నారు. దేశాన్ని సౌభాగ్యవంతం చెయ్యమన్నారు. కావలిస్తే ఒకపూట భోజనం మానెయ్యమన్నారు. అనవసరంగా తగాదాలకు దిగొద్దు అన్నారు. ఏ సమస్యనైనా, శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో పరిష్కరించుకోవాలని మరీమరి చెప్పారు. వాళ్లకిన్యాయంచేస్తే దేశద్రోహం చేసినట్టుకాదా?

శాయిలు: (కోపంగా, కసిగా) దేశ...ద్రో...హం. శాంతియుతం- ప్రశాంతవాతావరణం! హుఁ! మాటలకేం బహుముద్దుగా వుంటాయి. ఇప్పుడాళ్లన్నజాగాలో ప్రతి ఫ్యాక్టరీలో మార్క్సు లెనిన్ మహాశయులొచ్చేవరకు మీతో, ఆ_మీ, ముద్దుల నాయకులతో ఎడతెరిపిలేకుండా పోరాడుతూనేవుంటాం.

రాములు: మీరూ, ఆ క్యాలెండర్‌నాయకులు పేరువేరని మేమెట్లా అనుకుంటాం. పులికీ మేకకూ స్నేహం ఎందుకుంటుంది రామనాథంగారూ, అక్కడుండేది వైరం. మీకూ, మాకూ అంటే పీడించేవాళ్లకు, పీడింపబడేవాళ్లకూ మధ్య వుండేది సామరస్యంకాదు రామనాథంగారూ. పోరాటం. వర్గపోరాటం. శాయిలూ! బయట మన కార్మికసోదరులు ఎదురుచూస్తూవుంటారు. ఒకసారివెళ్లిరా.

అచ్చయ్య: నువ్వుండాన్రి శాయిలూ. నేను బొయ్యొస్తా.
(అచ్చయ్య బయటకెళ్లగానే, ముగ్గురు చిన్నపిల్లలు 'నాన్నా నాన్నా' 'మానాయనెక్కడ' అంటూ ఏడుస్తూ లోపలికొస్తారు. శాయిలు ఆప్యాయంగా దగ్గర తీస్తాడు పిల్లల్ని)

రాములు: (పిల్లల్ని చేరదీసి) నాన్నకేంగాలేదు. వస్తాడుండండి. ఇదిగో అటు చదువులేక, ఇటు తిండిలేక మలమల మాడిచచ్చే మాబిడ్డల్నిచూడండి. వాళ్లబతుకులేంగావాల? వాళ్లకిప్పుదేమిటిదిక్కు? హోటళ్లలో కప్పులుకడగాల. ఫుట్‌పాత్‌లమీద బిచ్చమెత్తుకోవాలి. ఖిక్షపతి పర్మినెంటు కార్మికుడైతే, కొంతైనా లాభముండేది. వాడి రక్తంతాగి ఏహక్కులేకుండా నాశనంచేశారు. అన్నిటినుంచీ దూరంచేశారు. చెప్పండి త్వరగా. అటో ఇటో తేల్చుకోండి.

రా.నా: (జేబులోంచి డబ్బుతీసి) ఇవి నీదగ్గరుంచు. టెంపరరీవర్కర్లను పర్మినెంటు చెయ్యడం యిప్పుడు సాధ్యంకాదు.

రాములు: అయితే, వాళ్ల శ్రమశక్తిని అట్లాగేదోచి, చిప్పచేతికిస్తామంటారు.

రా.నా: అట్లని ఈ నోటితో నేనెట్లా అంటాను?
(బయట నినాదాలు: 'రాజీబేరాలు పనికిరావు. దోపిడీ యాజమాన్యం నశించాలి' 'టెంపరరీవర్కర్లను పర్మినెంటుచెయ్యాలి.' 'వర్గపోరాటమే ఏకైకమార్గం.' 'ప్రపంచకార్మికులారా ఏకంకండి')

రా.నా: (రెండు నినాదాలు వినిపించగానే, నోరు వెళ్లబెట్టి) ఆఁ ఆఁ అది, అది ఏమిటది?

రాము: విన్నారుగదా! కార్మికశక్తి అంటే అది. ప్రపంచంలో దాన్ని అడ్డుకునేశక్తి దేనికీలేదు. పెట్టుబడిదారుల పెంపుడుకుక్కల్లాంటి, ట్రేడ్‌యూనియన్‌ల విష కౌగిళ్ల నుండి కార్మికులు బయటపడుతున్నారు. ఈ పోరాటం ఇంతటితోఆగదు. ఇది మొదలు. ఈ ఫ్యాక్టరీలు మావి. వాటిని నిర్మించింది మేమే. ఉత్పత్తులు పెంచేది మేము. ఆ సంపద చెందాల్సింది మాకే. ప్రతి ఫ్యాక్టరీలో పర్మినెంటు టెంపరరీ వర్కర్లందరు ఏకమై వాళ్ల అధికారంకోసం పోరాడుతున్నారు.

(రంగన్న భిక్షపతిశవంతోవచ్చి టేబుల్‌మీద పడుకోబెడ్తాడు.)

అచ్చయ్య: (వస్తూ) తొవ్వల్నే అయిపోయింది.
(పిల్లలు 'నాన్నా నాన్నా' అంటూ ఏడ్పులంకించుకుంటారు.)

శాయిలు: (శవందగ్గరికి వెళ్లి) అయిపోయింది. భిక్షపతి చచ్చిపోయిండు. (కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంటాడు. అచ్చయ్య పిల్లల్ని ఓదార్చుతుంటాడు)

అచ్చయ్య: వాడి చావుఖర్చులన్న ఇస్తడేమొ అడగండ్రి.

శాయిలు: (కోపంతో లేచి) అచ్చయ్యా. మనకు కావలసినవి దానాలుకావు. అయినా డబ్బునోళ్లు లాభాలులేనిదే దానాలు చెయ్యరురా. మాటల్తో వాళ్ల గుండెలూ కరగవురా. రామనాథంగారూ! (టేబుల్‌మీది కోకాకోలాసీసా పగలగొట్టి రామనాథం మీదికెడుతూ) మేం అడిగినై చేస్తారా లేదా ఆఖరుమాటచెప్పండి.

రా.నా: (వెళ్లి ఫోను ఎత్తుతాడు)

రాములు: అచ్చయ్యా!

అచ్చయ్య: అరేయ్ బద్మాష్(టేబుల్‌మీది కత్తితీసుకొని టెలిఫోనుతీగలు కోసేస్తాడు)

రా.నా: రాస్కెల్స్. ఇంతకు తెగిస్తారా? మీ పని పడతాను. నా దగ్గర చిల్లిగవ్వ కూడా దొరకదు, మిమ్మల్ని మూడుచెరువుల నీళ్ల తాగించకపోతే, నా పేరు రామనాథమేగాదు.

రాములు: రామనాథంగారూ! మీదగ్గరినుంచి డబ్బులు ఎట్లా రాబట్టాలో మాకు బాగా తెలుసు. అంతేగాదు. మేమిచ్చిన గడువులో టెంపరరీవర్కర్లను పర్మినెంటు చెయ్యకపోతే మీ ఫ్యాక్టరీ ఎట్లా నడుస్తుందో అదీ చూస్తాం. కేశవులే రానీ, పోలీసుగుండాలేరానీ, మా పోరాటం ఆగదు. అన్ని ఫ్యాక్టరీల్లో ఈ పోరాటం రేపటినుంచే ఆరంభం కాబోతుంది.

రా.నా: అదీ చూస్తాను. ఫ్యాక్టరి లాకవ్‌చేస్తే ఎక్కడచెప్పుకుంటారో చెప్పుకోపోండి.

రాములు: ఫ్యాక్టరీల తాళాలు తీయించడం, పగలగొట్టడం మాకు బాగా తెలుసు రామనాథంగారూ. సుత్తెలు మా చేతుల్లోనేవుంటాయి.

రా.నా: అదీ చూస్తాను. (ఎదురుగావున్న శాయిలు చేతిమీదకొట్టి పోబోతాడు.)

శాయిలు: భిక్షపతి కుటుంబానికి నష్టపరిహారం ఇస్తేనే వదులుతాం.

అచ్చయ్య: హుఁ తియ్ డబ్బు

రా.నా: (పిచ్చిగా ఇక లాభంలేదన్నట్లు) ఛీ ఛీ ఛీ రౌడీ రాజ్యం అయిపోయింది. (డబ్బుతీసి రాములుకిస్తాడు.)

రాములు: ఇది మా తాత్కాలిక విజయమే. ముందే చెప్పినట్టు ఇది ప్రారంభం. టెంపరరీ వర్కర్లందరు పర్మినెంటు అయ్యేవరకు ఇది సాగుతూనే వుంటుంది. దీని అంతం ఏమిటో తెలుసా? ఈ ఫ్యాక్టరీలకు, ఉత్పత్తికీ, సర్వసంపదలకు ప్రజలు సర్వాధికారులు కావడమే. రెండే రెండు రోజులు టైం ఇస్తున్నాం. ఒక్క టెంపరరీ లేబరూ ఫ్యాక్టరీముందు కనిపించగూడదు జాగ్రత్త.

(భిక్షపతిని భుజం మీదికి తీసుకోగానే శాయిలు "భిక్షపతి అమర్ హై!" అచ్చయ్య 'కామ్రేడ్ భిక్షపతి అమర్ హై' అంటూ ముందుకు నడుస్తుంటారు. బయట పెద్దపెట్టున నినాదాలు :— "కామ్రేడ్ భిక్షపతి అమర్ హై. కార్మికవర్గ ఐక్యత వర్ధిల్లాలి. యజమానుల తొత్తు యూనియన్‌లు నశించాలి. టెంపరరీ వర్కర్లందర్నీ పర్మినెంటు చెయ్యాలి. భూమికోసం భుక్తికోసమే కాదు— విముక్తికోసం పోరాడండి. ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే నినాదాలు విన్పిస్తుంటాయి... రామనాథం నినాదాలు వింటూ అటూఇటూ పచార్లుచేసి క్యాలెండర్ నాయకులవేపుచూస్తూ స్థాణువులా నుంచుండిపోతాడు.)

(తెర)

(హైదరాబాదు 1973 మేడే ఉత్సవాల్లో రాంనగర్, బోయిగూడా కార్మికవాడల్లో, విజయవంతంగా మొదటి ప్రదర్శనలిచ్చిన రాంనగర్ యువజన సంఘం కార్మిక సోదరులకు, దర్శకత్వం వహించిన శ్రీ సి. యస్. రావుగారికి కృతజ్ఞుణ్ణి. — రచయిత)

విద్యారంగంలో చైనా విప్లవం

పరీక్షలు....మార్కులు.... పోటీలులేని విధానం.

రచన: రుత్‌సిడల్   అనువాదం: రాంప్రసాద్

(ఇండియన్ ఎక్స్‌ప్రెస్: 17-9-72)

సోషలిస్టు సమాజాన్ని నిర్మిస్తున్న జనచైనా అందుకనుగుణంగా విద్యావిధానంలో అనుసరిస్తున్న పద్ధతులేమిటి? ముఖ్యంగా చిన్నతనంనుండి పిల్లలకు నిస్వార్థంగావుండటం, శ్రామికులను రైతులను గౌరవించడం, శరీరశ్రమపట్ల గౌరవం ఎలానేర్పుతారు. చైనా ప్రాథమికవిద్య గురించి తెలుసుకోవడం ఆసక్తిదాయకంగానే కాక ఎంతో వుపయోగకరంగాకూడా వుంటుంది.

పెకింగ్‌లో 'పాతుపు హౌటు' పసిపిల్లలస్కూలు. ఆరేళ్ళ పిల్లలు 26గురు రెండు వరుసల్లో కూర్చుని లెక్కలతోపాటు సోషలిస్టు పౌరసత్వంగురించి నేర్చుకుంటున్నారు. కమ్యూన్లకి సహాయపడుతూ చిన్నపిల్లలు ఆదివారాలు ఎలా గడుపుతారో టీచరు చెప్తున్నది. 'ఒక కమ్యూన్‌లో పిల్లలు ఉదయం నాలుగుబళ్ళ ఎరువు, మధ్యాహ్నం అయిదుబళ్ళ ఎరువు పోగేస్తారు. అయితే వాళ్ళు మొత్తం ఎంత ఎరువు కూడవేస్తారు' ఇది ఒక లెక్క. 'ఒక యువజన సంఘం ఆరుపందుల్ని, ఇంకోటి మూడుపందుల్ని పెంచుతారు అయితే అందరూకలిసి మొత్తం ఎన్నిపందులు పెంచుతారు' ఈలెక్కకు జవాబు చెప్పటానికి ఇంచుమించుగా పిల్లలందరూ చేతులెత్తుతారు.

మరోక్లాసులో ఆరున్నరేళ్ళపిల్లలు 22 మంది చైనీస్ అక్షరాలు రాయడంనేర్చుకుంటున్నారు. 'ఏకంకండి' అనేమాట నేర్పుతున్నారు. ఈమాట "ఇంకా ఘనతర విజయాలను సాధించటానికి ఏకంకండి"అనేవాక్యంలోది. ఇది ఛైర్మన్‌మావోసూక్తి. టీచరు మొదట వాక్యమంతటితోపాటు ఈమాటను బోర్డుమీద వ్రాస్తుంది. ఆ తరువాత పిల్లలందరితో గొంతుకలిపి గుణింతంచెబుతూ "ఏకంకండి" అనే మాట ఒక్కటి వేరే వ్రాస్తుంది. తరువాత బోర్డుమీద ఈమాట ఎవరురాస్తారని టీచరుఅడగ్గానే చాలామంది చేతులెత్తుతారు. పిలిచిన యిద్దర్లో ఒకడు సరిగ్గారాశాడు। రెండోవాడు కొద్దిగా తప్పు రాస్తే సరిదిద్ది టీచరు భుజం తట్టింది. ఇద్దరూ నవ్వుకుంటూ వాళ్ళ స్థలాల్లోకిపోయి కూర్చున్నారు.

షాంఘైలో యు-యాప్ రోడ్ కిండర్ గార్టెన్ లో ఐదేళ్ల పిల్లలు 24 గురు విప్లవ సంస్కృతి, కళల గురించి నేర్చుకుంటున్నారు. ఒక్కో బల్లకి నలుగురేసి చొప్పున కూర్చుంటున్నారు. బోర్డుమీద ఒకపెద్ద ఓడబొమ్మ తగిలించివుంది. పిల్లలంతా బల్లల ముందు నిల్చుని చప్పట్లు చరుస్తూ ఓడ నిర్మాణంగురించి పాడతారు. ఆ తరువాత ఓడ నిర్మాణంగురించి టీచరు యిలా చెబుతుంది. "దీన్ని కార్మికులు నిర్మించారు విముక్తికి పూర్వం మనం ఓడలు నిర్మించలేకపోయేవారం. కాని ఆ తరువాత "స్వశక్తిపై నేనమ్మకముంచి ముందుకుసాగాలి" అనే మావో ఆదేశాన్ని అందుకుని యిప్పుడు మన కార్మికులే ఓడల్ని నిర్మిస్తున్నారు. ఈ ఓడ దేశం నలుమూలలకి సరుకులు చేరవేస్తుంది, విదేశాలకు స్నేహాన్ని తీసికెళ్తుంది, మరింత విజ్ఞానం సంపాదించేందుకు మన రెడ్ గార్డుల్ని దేశదేశాలకు తీసికెళ్తుంది." అలాచెప్పి టీచరు రంగుసుద్దలతో బోర్డుమీద ఓడ బొమ్మగీస్తుంది. ఓడ ఆకారంచూపే గీతల్ని నెమ్మదిగా ఒక్కొక్కటి వివరిస్తూ బోర్డుమీదగీసి పిల్లల్నికూడా అదేవిధంగా వాళ్ళ డ్రాయింగ్ పుస్తకాల్లో వ్రాసుకోమంటుంది.

1966 లో చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవానికి ఒక ప్రాధాన్యత వుంది. వర్గసమాజపు అవశేషాలను సమాజంనుండి నిశ్శేషంగా తొలగించడమే అది. విద్యార్థులలో ముఖ్యంగా పసితనంనుండికూడా వాళ్ళ మనస్సులనుండి బూర్జువా ఆలోచనలను తొలగించి, వారు సమాజసేవకు అంకితమయేలా చూడడమే విద్యారంగం ప్రధాన ఆశయం. చైనా ప్రాథమిక విద్యావిధానంలో యీ నూతన ఆశయం సంపూర్ణంగా ప్రతిఫలిస్తుంది.

తల్లికి ప్రసూతిశెలవు ముగిసినప్పటినుండి అంటే పిల్లలకు రెండు నెలల వయస్సునుంచి ఏడేళ్ళవయస్సువరకూ పిల్లల శిక్షణకు మూడురకాల పబ్లిక్ సంస్థలున్నాయి. అవి "నర్సరీరూం" "నర్సరీ" కిండర్ గార్టెన్. ఏడేళ్ళ వయస్సువచ్చాక పిల్లలందరూ తప్పనిసరిగా ప్రయిమరీ స్కూలుకి వెళ్లాలి.

అఖిలచైనా మెడికల్ అసోసియేషన్ కాన్టన్ వుద్యోగి చీన్-హ్యూ-చెంగ్ చెప్పినట్లు "చిన్నపిల్లల విద్యా విధానానికి చైనా స్త్రీల విముక్తికి ప్రత్యక్షసంబంధం వుంది. పూర్వం సమాజంలో స్త్రీ చాలా హీనస్థితిలో వుండేది. కాని యిపుడు మాకూ సమాన హక్కులున్నాయి. ఇదివరలో సంసారం గడపడం భర్తకు సేవచెయ్యటం గురించి మాత్రమే ఆలోచించే స్త్రీ యిపుడు విప్లవంలో పాల్గొనడం గొప్పవరంగా ఎంచుకుంటున్నది." అయితే స్త్రీలు విప్లవంలో పాల్గొనాలంటే స్కూలుకి వెళ్ళేలోగా పసిపిల్లలను

పెంచే సంస్థలు వుండాలి. చిన్నపిల్లల పెంపకంలో తండ్రులుకూడా యెక్కువగానే బాధ్యతవహిస్తారు. తల్లిదండ్రి వేరు వేరు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నపుడు తల్లి పనికివెళితే తండ్రి పిల్లల్ని చూచుకుంటాడు. సాధారణంగా తండ్రి ఫ్యాక్టరీలోవుండే నర్సరీకి పిల్లల్ని తీసికెళ్తాడు. నిద్రపోయే పసిపిల్లల్ని భుజానెత్తుకుని, నడిచే పిల్లల్ని చెయ్యి పుచ్చుకుని నడిపిస్తూ ఫ్యాక్టరీకివెళుతూ సైకిల్‌మీద పిల్లల్ని కూర్చోపెట్టుకొని తండ్రులు పిల్లలబాధ్యత వహించడం చైనాలో సాధారణంగా కనుపించే దృశ్యమే. సంవత్సరము న్నర వయస్సులో పిల్లలు నర్సరీలో చేరవచ్చు. లేదా ఇండ్లదగ్గర ముసిలోళ్ళు పెంచ వచ్చు. తల్లుల పెంపకంకూడా లేకపోలేదు, కాని నూటికి తొంభైమంది ఆడవాళ్ళ పనుల్లోకి వెళతారు కనుక యిది అరుదు.

ఈ నర్సరీలు, కిండర్‌గార్టెన్‌లు పిల్లలకు శ్రామికుల్ని, రైతుల్ని, సైనికుల్ని ప్రేమించడం ఎలా నేర్పుతాయి? నిస్వార్థంగా వుండటం కాయకష్టం చేయటం పిల్లలు యిక్కడ ఎలా నేర్చుకుంటారు? ప్రజలకోసం ఏ త్యాగమయినా, చివరకు ప్రాణాలు అర్పించవలసివచ్చినా గొప్పకాదని అక్కడ పిల్లలకు ఎలా అర్థమవుతుంది?

విద్యావిధానంలో యీ విప్లవ సాధనకు కారణభూతమయిన అంశాల్లో అత్యంత ఆసక్తిదాయకమయినది కీలకమయినది అక్కడి ఉపాధ్యాయులు. ఆ ఉపాధ్యాయులకు వారి వృత్తిపట్ల అమోఘమయిన వుత్సాహం తీవ్రమయిన ఆవేశం దృఢమయిన దీక్షవున్నాయి. విద్యార్థులపట్ల అపారమయిన ఆప్యాయత అతిసన్నిహితత్వంవున్నాయి. బోధనావిషయాలలో అసాధారణప్రజ్ఞ వుంది. విద్యార్థుల్ని శ్రామికతరానికి నిజమైన వారసులుగా తయారుచేయడం తమ కర్తవ్యమని వారి ప్రగాఢ నమ్మకం, వారుచెప్పే పాటలో, పద్యంలో, కథలో, నాట్యంలో ఈ గాఢమైన విశ్వాసం దీక్ష ప్రతిఫలిస్తూ వుంటాయి.

నర్సరీలలో సహజీవనం ద్వారా పిల్లలు ఇతరులతో బాధ్యతగా ప్రవర్తించడం, పొరుగువారిని ప్రేమించటం అలవర్చుకుంటారు. ఒక నర్సరీలో కార్యకర్త చెప్పినట్లు "పిల్లాడు క్రిందపడితే టీచరు సాయం కోరడు, తోటిపిల్లలే లేవనెత్తి సముదాయిస్తారు" అపుడు టీచరు "మనం ఒకరికొకరు సాయం చేసుకోవాలి" అని చెప్పి వారిని ప్రోత్సహిస్తుంది. మూడేళ్ళ వయస్సుకే పిల్లలకు ఒకరికొకరు సహాయం చేసుకునే అలవాటు పట్టుబడుతుంది. చలికాలంలో వెనకప్రక్కవుండే చొక్కాల గుండీలను పెట్టుకోడంలో ఒకరికొకరు తోడ్పడతారు. పిల్లలమధ్య ఎప్పుడూ పోటీవుండదు. ఒకపని ఎవరు ముందుచేస్తారనికాని, ఎవరు ఎక్కువగా చేస్తారనికాని వాళ్ళు పోటీపడరు. లెక్కలు

చేసేటప్పుడు ఎవరు ముందుగా జవాబు కనుక్కుంటారన్నది ముఖ్యంకాదు. వాళ్ళు సహకారం గురించి నేర్చుకుంటారుతప్ప, పోటీగురించికాదు. వ్యక్తికికాక సమూహానికే ప్రాముఖ్యం ఇస్తారు.

అప్పుడప్పుడు పిల్లలు పోట్లాడుకొకపోరు అప్పుడు టీచర్లు వాళ్ళకి ఛైర్మెన్ మావో బోధలను వివరించి ఒకరినొకరు ప్రేమించాలని, సహాయపడాలని, రక్షణగా వుండాలని నచ్చజెప్తారు. సాధారంగా పిల్లలు వీటిని సరిగానే అర్థం చేసుకుంటారు. అయితే టీచర్లకు చాలా ఓరిమి అవసరము. చెప్పిందే పదిసార్లు చెప్పవలసిరావచ్చు. విద్యార్థికి ఉపాధ్యాయుడుకి మధ్యగల సంబంధం సహజమైన మానవతా సంబంధాలను బలపర్చేదిగా వుంటుంది. పిల్లల్లో నమ్మకముంచి వాళ్ళ మంచిగాను బుజ్జగిస్తునూ, మాట్లాడటమువల్ల ఉపాధ్యాయులు పిల్లలనుండి అసాధారణమైన సహకారం పొందుతున్నారు. పిల్లలేమైనా తప్పుచేసినపుడు టీచరు నెమ్మదిగా అప్యాయంగా నచ్చజెప్పి సరైన మార్గంలో పెడుతుంది. టీచరు కోపం ప్రదర్శించటంకాని పిల్లల్ని కసురుకోవటంకాని వుండదు. (తల్లిదండ్రులుకూడా పిల్లల్ని కసురుకోవడం మేమెప్పుడూ చూళ్లేదు).

ఈ స్కూళ్లల్లో శ్రామికులు రైతులపట్ల గౌరవాన్ని ప్రబోధించడమేకాక శరీర శ్రమయొక్క విలువను ప్రాధాన్యతను వివరించి దానిపట్ల పిల్లలకు అత్యున్నతమైన గౌరవాన్ని కల్గిస్తారు. నర్సరీల్లో పిల్లలు తమ పనులు తామే చేసుకోవడము, తమ దుస్తులు తామే వేసుకోవడం నేర్చుకుంటారు. కిండర్‌గార్టెన్‌కి వెళ్ళిన దగ్గరనుంచి ఉత్పత్తికి వుపయోగపడే చిన్నచిన్నపనులుకూడా నేర్చుకుంటారు. పువ్వులమొక్కల్ని పెంచి మొక్కలు ఎలా మొలిచి ఎదుగుతాయో అర్థంచేసుకుంటారు. అందుమూలంగా ధాన్యం, కూరగాయలు పండించడం ఎంత కష్టంతోకూడుకున్నదో గ్రహిస్తారు. తాము కూర్చునే బల్లలు కుర్చీలు, గదినేల ఊడవటం, చేతిరుమాళ్లు వుతుక్కోవటం మొదలైన చిన్నపనులు స్వయంగా చేసుకుంటారు. అందరూకలిసి రంగుపెన్సిళ్లువుంచుకునే అట్టపెట్టెలను తయారుచేస్తారు. ఉత్పత్తులను సృష్టించే సమూహికశ్రమలో యీ పాఠాలు ఒకభాగం. నాలుగున్నరేళ్ల పిల్లలు 24 గురు రెండు పొడుగాటి బెంచీలపై కూర్చొని అట్టల్ని మడిచి పెట్టెలుచేసి చెక్కపెట్టెలో అమర్చుతారు. ఇలా రోజూ ఒక అరగంట పనిచేస్తారు. రంగుపెన్సిళ్ళను కాగితాల్లో చుట్టి అట్టపెట్టెల్లో పేర్చడం ఇంకొకపని ఇదీ రోజుకొక అరగంట వుంటుంది. ఇదంతా పిల్లలకు పనులునేర్పడం కాదు. ఫ్యాక్టరీలో కార్మికులకు బదులుగానే ఈ పనుల్ని పిల్లలు నిర్వహిస్తారు. దీనికి ప్రతిఫలం స్కూళ్లకు యిస్తారు.

చైనా విద్యావిధానంలోనే విప్లవపంథాలో అంత్యంత ఆసక్తిదాయకమైనది ప్రగాఢపరిభావంకలది ఒక అంశముంది. కిండర్‌గార్టెన్‌నుంచికూడా మావో ఆలోచనావిధానంపై పాఠాలు బోధిస్తారు. షాంఘైనగరంలో ఒక వీధిలోని ి౦డర్‌గార్టెన్‌లో యీ పాఠాలు చెప్తున్నారు. అక్కడి పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం తరువాతి ప్రభావం చాలావుంది. విప్లవ పాఠ్యాంశం, ఆవేశపూరితులైన ఉపాధ్యాయులు, సంపూర్ణ నిమగ్నతతో నిష్టగా అధ్యయనంచేసే విద్యార్థులు, 1949 ముందుకాలంలోనే జీవితపు గడ్డు అనుభవాలు, శ్రామికులు, రైతులు, సైనికులపట్ల విపరీతమయిన గౌరవము, చైర్మన్ మావోపట్ల ప్రగాఢమయినప్రేమ- ఇవన్నీ ఆ వాతావరణంలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి.

ఒక అర్థచంద్రాకారపు బల్లదగ్గర అయిదు సంవత్సరాల వయస్సుగల పిల్లలు 20 గురు కూర్చుని చకచక మాట్లాడుతున్న టీచరుకు చెవులప్పగించి వింటున్నారు. ఆవిడకు 30 ఏళ్ళు వుండవచ్చు. ఒకానొక కమ్యూన్‌లో మావో సూక్తులను అత్యంత శ్రద్ధాశక్తులతో అధ్యయనంచేసి జాతీయ దినోత్సవాలకు ప్రతినిధిగా ఎన్నికైన ఒక ఆదర్శ ఉపాధ్యాయినిగురించి వాళ్ళకు బోధిస్తోంది. పాఠంకథ చెప్పుకున్నట్లు యిలా సంభాషణరూపంలో జరుగుతుంది.

టీ :— ఛైర్మన్ మావోకు మీరేం చెప్తారు.

బ :— మేము పగలు రాత్రి మీగురించే ఆలోచిస్తూ వుంటాము.

ఇంకో :— మేము ఎపుడూ మిమ్మల్నే కోరుకుంటాము.

టీ :—ఆ ఆదర్శ ఉపాధ్యాయిని పెకింగ్ వెళ్తోంది. ఆవిడెలా ప్రయాణంచేస్తుంది. 'ట్రెయిన్'లో అని అందరూ ఒకేసారి అరుస్తారు. తరువాత టీచరిలా చెప్తుంది: ట్రెయిన్‌లో ఆవిడ చదువుకుంటుంది ఉషారుగా పాటలు పాడుతుంది. ఇతర ప్రయాణీకులుకూడా ఆమెతోకలిసి వంతపాడుతారు. జాతీయ దినోత్సవంలోపాల్గొనే కార్మిక కర్షక ప్రతినిధుల్ని తీసుకువెళ్తున్నామనే సంతోషంతోనూ, గర్వంతోనూ కార్మికులు ఆ రైల్ని తొందరగా పరిగెత్తిస్తారు. పెకింగ్‌లో ఆ టీచరు ఎక్కడవుంటుంది "నాయకులంతా బసచేసేచోటనే"అని పిల్లలందరూ చెప్తారు. అపును ఆమె నాయకులబసలోనే వుంది. విప్లవానికిముందు బీద, మధ్యతరగతిరైతుల జీవితాలు అతిదుర్భరంగావుండేవి. ఈ ఆదర్శ ఉపాధ్యాయిని కుటుంబంలో తండ్రితప్ప మిగతా అందరూ చనిపోయారు. భూమిశిస్తు చెల్లించలేదని తండ్రిని భూస్వామి ఖైదులోపెట్టించాడు. కార్మికులు, రైతులూ అంతా భూస్వాములకింద ఆ విధంగా నలిగిపోయారు. అలాంటిది ఇప్పుడుతాను జాతీయదినోత్సవానికి ప్రతినిధిగా ఎన్నికవటమేకాక నాయకులతోపాటే వాళ్ళ బసలోనే

విడిదిచేయగల్గుతోంది. విప్లవం తరువాత కార్మికుల బతుకు ఎంతో మెరుగైంది. అదంతా గుర్తుకొచ్చి ఆదర్శ ఉపాధ్యాయిని కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి అంటూ "అక్టోబర్ ఒకటి అంటే ఏమిటి ? అని ప్రశ్నించింది టీచరు". జాతీయదినం అని ముక్త కంఠంతో పిల్లలంతా చెప్పారు. "సరిగా వినపడలేదు"అని టీచరు ముఖం చిట్లించగా "జాతీయ దినం"అని సంతోషం మిన్నుముట్టావుండగా పిల్లలంతా మరింత గట్టిగా చెప్పారు. రెండుచేతులు ఊపుతూ వాళ్ళను సముదాయిస్తూ టీచరు మళ్ళీ ప్రారంభించింది.

మరుసటిరోజు ప్రతినిధులంతా ఛైర్మన్ మావోను చూడబోతారు. ఆ వుత్సాహంతో, ఆతృతతో వారికారాత్రి నిద్రపట్టనేలేదు. మరునాడుదయము వారు ఎక్కడికి వెళ్తారు.

"తిన్-యాన్-మిన్"పెకింగ్‌లో బహిరంగప్రదర్శనలు కవాతులుజరిగేస్థలానికి"

టీచరు తనపక్కనే స్టాండుపైనున్న పటంమీద తెరతొలగిస్తోంది. ఆ పటంలో కార్మికులు, కర్షకులు, సైనికులు మహోత్సాహంతో 'ఎర్రపుస్తకాన్ని' వూపుతూ వుంటారు, వారివెనుక ఎర్రజెండా ఎత్తుగా ఎగురుతూ వుంటుంది. ముందు భాగంలో పెద్దపెద్ద అక్షరాలతో చైనాభాషలో వ్రాసిన బానర్ వుంటుంది. ఆ ఊరేగింపుదృశ్యాన్ని అతి ఉత్సాహంతో తిలకిస్తూ" అందులో ఏమి కనపడుతోంది" అని పిల్లల్ని ప్రశ్నింది టీచరు.

"చైర్మన్ మావో చిరకాలం వర్ధిల్లాలి అంటూ ఆ బేనర్‌మీదవున్న అక్షరాలు పిల్లలంతా బిగ్గరగా చదువుతారు.

"ఇంకా ఏమి కన్పిస్తోంది"

ఎగురుతున్న ఎర్రజండాలు"

టీచరు పటంలో ఆదర్శ ఉపాధ్యాయినిని చూపించి ఆమెరానేపటిలో చైర్మన్ మావోను చూడబోతున్నది కనుక చాలా ఉత్సాహంగా ఉన్నదంటూ ఉద్వేగంగా చెబుతుంది. (క్రమంగా పిల్లల్లో ఉత్సాహంపెరిగి వాళ్ళు వాళ్ళ స్థానల్లో కుదురుగా కూర్చోలేనంత ఉద్వేగం పొందుతారు"

టీ:— వాళ్ళు ఏమి పాటలు పాడుతారు.

పి:— "తూరుపు ఎరుపెక్కింది" అనేపాట

టీచరు ఇంకోపటంమీద తెర తీసింది అందులో అందర్నీ అభినందిస్తున్న మావో బొమ్మ వుంది. వెంటనే అందరూ ఒక్కసారి చేయి "పైకెత్తి చైర్మెన్ మావో వర్ధిల్లాలి" అని నినాదాలు చేస్తారు.

"మనకత్యంత ప్రియమైనదెవరు"

"చైర్మెన్ మావో" అందరూ ఒక్కసారిగా అరుస్తారు. తరువాత ఎవరి స్థానాల్లోవారు నిలబడి చైర్మెన్ మావోపట్ల ప్రేమ, గౌరవం వ్యక్తంచేస్తూ, ఎగురుతూ పాటలు పాటలు పాడతారు. అందరూ టీచర్ని అనుకరిస్తూ నాట్యం చేస్తారు. క్లాసు అలా ముగుస్తుంది.

సామ్యవాద సమాజపు విలువల్ని పిల్లలకు బోధించడంలో సంగీతరూపకాలవంటి ప్రదర్శనలు చాలాముఖ్యపాత్ర వహిస్తాయి. సాధారంగా కిండర్ గార్టెన్ ప్రదర్శనలలో మైనారిటీ జాతుల పీడితవర్గాల కథలను వారివేషభాషల్లోనే ప్రదర్శించేవి అతిముఖ్య భాగంగా ఉంటాయి. ఒక కిండర్ గార్టెన్ ప్రదర్శనలో అయిదేళ్ళ పిల్లలు అంతర్ మంగోలియా రెడ్‌గార్డుల వేషాలు వేసుకుని పనిముట్లు ఆయుధాలు పట్టుకొని కదం తొక్కుతూ కార్మికులు సైనికులను గురించి పాటలు పాడారు. ఇంకో బడిలో "నా దగ్గర రంగు పెన్సిలుంది" అనేపాటని అయిదేళ్ల పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాడారు. 'ఎర్రపెన్సిల్‌తో ఎర్రజెండా గీస్తాం, నల్ల పెన్సిల్‌తో ఆఫ్రికాపటం వేస్తాం' అంటూ వాళ్ళు ఆ పాటను ఎంతో ఉద్రేకంగా ప్రదర్శించారు. బహుళ ప్రచారంలోఉన్నమరొక పాట తైవాన్‌ను గురించినది "రెండు చైనాలు ఉండటం నగుబాటు: తైవాన్‌నువిముక్తి చేసితీరుతాం; ప్రపంచం పీడిత ప్రజలను విజయం వరించడం తథ్యం" అని పాడు తున్నప్పుడు పిల్లల ముఖాల్లో తీవ్రమైన క్రోధం పెల్లుబుకుతుంది.

దీనినుంచి తెలిసేదేమిటి? స్వార్థప్రయోజనాలని విస్మరించి సమాజ ప్రయోజ నాలగురించి, సమిష్టి శ్రేయస్సు గురించి పాటుపడేందుకు చైనా విద్యా విధానం మనిషికి చిన్నతనంనుంచి శిక్షణ ఇస్తున్నదికదా? అయితే నేటివరకు ప్రత్యక్ష నాయకత్వం వహిస్తున్న ఈ తరం నాయకులు అంతరించిన చైనా ప్రజల్లో ఈ ఉత్సాహం ఈ దీక్ష ఇలాగే ఉంటాయా? సాంస్కృతిక విప్లవం ప్రారంభమై అయిదేళ్లే అయింది. మరో పది పదిహేనేళ్లో లేదా 20 ఏళ్లో పోతేగాని ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలు దొరకవేమో? అలోగా చైనాలో ఇంకో సాంస్కృతిక విప్లవం రావచ్చు; మరికొన్ని కొత్త ప్రయోగాలు జరుగవచ్చు. వారు ఇప్పుడు అవలంభిస్తున్న విధానాలన్నీ ప్రయోగాలేనని, అవి ఇపుడు పోరాటం—విమర్శ—పరివర్తన దశలో ఉన్నాయని, సరి యైన పరిష్కారాలకోసం అన్వేషణ ఇంకా సాగుతున్నదని వారే చెప్తున్నారు.

కాని చైనా ప్రజలు మరికొన్ని క్రొత్త ప్రయోగాలుచేసి ఇంకా నూతన విధా నాలు చేపట్టేలోగా వారిప్రస్తుత విధానాలనుంచి మనం నేర్చుకోవలసినది ఎంతైనాఉంది.

జన చైనాలో :

పాఠశాల కార్యక్రమం

లూలింగ్ (Liu – Ling) పాఠశాల

మొదటి తరగతి: (పీరియడ్ : 40 నిమిషాలు)

లెక్కలు— వారానికి ఆరు పీరియడ్లు.
కూడిక, తీసివేత, గుణించడం. 100 వరకు

చైనీస్ భాష— వారానికి 14 పీరియడ్లు.
ఇందులో చేతివ్రాతకు మూడు పీరియడ్లు.
అక్షరాల సంఖ్యపై పరిమితి లేదు.

డ్రాయింగ్— వారానికి రెండు పీరియడ్లు.
టీచర్ గీసిన బొమ్మలను పిల్లలు కాపీచేస్తారు.
బొమ్మలుగీసే విధానం తెలుసుకొంటారు.

వ్యాయామం ఆటలు... :— వారానికి రెండు పీరియడ్లు.
పరుగెత్తడంలాంటి వ్యాయామం, ఆటలు,

సంగీతం :— వారానికి రెండు పీరియడ్లు.
అందరూ కలిసి పాటలు పాడుతారు.

సొంతంగా చదువుకోవడం :— వారానికి పదహారు పీరియడ్లు.
టీచర్ పర్యవేక్షణలో స్కూల్లో చెప్పబోయే పాఠానికి ముందుగానే తయారవుతారు.

హోం వర్క్ :— రోజుకి ఒక గంట.

తోటపని :— లేదు.

చేతిపనులు :— లేవు.

రెండో తరగతి :

లెక్కలు :— వారానికి ఆరు పీరియడ్లు.
రెండంకెల సంఖ్యలను గుణించడం, భాగించడం.
ఎక్కువ సంఖ్యతో కూడికలు, తీసివేతలు.

చైనీస్ భాష :— వారానికి 14 పీరియడ్లు.
ఇందులో చేతివ్రాతకు మూడు.
అక్షరాలు చదవడం ఎన్నిఅయినా చదవచ్చు.

డ్రాయింగ్ :— వారానికి రెండు పీరియడ్లు.
కాపీచేయడం.

సంగీతం :— వారానికి రెండు పీరియడ్లు.
సామూహికంగా పాటలు పాడుతారు.

వ్యాయామం, ఆటలు... :— వారానికి రెండు పీరియడ్లు.
పిల్లలకు సరిపోయిన ఆటలు, వ్యాయామం.

సొంతంగా చదువుకోవడం :— వారానికి పదహారు పీరియడ్లు.

హోం వర్క్ :— రోజుకి ఒక్క గంట.

తోటపని :— లేదు.

చేతిపనులు :— లేవు.

మూడో తరగతి :

లెక్కలు :— వారానికి ఆరు పీరియడ్లు.
పెద్ద సంఖ్యలతో గుణించడం, భాగించడం. గడియారాన్ని చూసి టైం చెప్పడం. లెక్కలకి జవాబులు కనుక్కోవడం.

చైనీస్ భాష :— వారానికి 14 పీరియడ్లు.
ఇందులో రెండు పీరియడ్లు చేతివ్రాత, మరి రెండు పీరియడులు కాంపోజిషన్. చిన్న చిన్న వ్యాసాలు వ్రాయడం, బొమ్మలను వర్ణించడం.

డ్రాయింగ్ :— వారానికొక పీరియడ్.
కాపీచేస్తారు.

సంగీతం :— వారానికి రెండు పీరియడులు.
సామూహికంగా పాటలు పాడుతారు. బాగా పాడగల్గినవారు స్వతంత్రంగా పాడుట మొదలుపెడతారు.

వ్యాయామం, ఆటలు... :— వారానికి రెండు పీరియడులు.
కసరత్తు, ఫుట్‌బాల్, పరుగెత్తడంలాంటి ఆటలు.

సొంతంగా చదువుకోవడం :— వారానికి పదిహేడు పీరియడ్లు.
పిల్లలు డైరీలు వ్రాయడం మొదలుపెడతారు.

హోంవర్క్ :— రోజుకి ఒక గంట.

చేతిపనులు :— లేవు.
కాని ఎవరైనా పిల్లలు ఇష్టపడితే కూరపాదులలో కలుపు తీయడం, గదులు, దొడ్డి ఊడవడంలాంటి పనులు చేయవచ్చు.

నాలుగో తరగతి :

లెక్కలు :— వారానికి 5 పీరియడ్‌లు.
భూమి విస్తీర్ణం, కాలాన్ని కొలవడం, చైనీస్ తూకాలను మెట్రిక్ తూకాలకు మార్చడం, ఎబాకస్ (Abacus) వాడటం, వారానికి రెండు పీరియడ్‌లు, దీని సహాయంతో కూడిక, తీసివేత, భాగాహారం, దశాంశస్థానముల గుర్తింపు నేర్పుతారు.

చైనీస్‌భాష :— వారానికి 14 పీరియడ్‌లు. ఇందులో చేతివ్రాతకు రెండు పీరియడ్‌లు, కంపోజిషన్‌కు రెండు పీరియడ్‌లు, పాఠ్యపుస్తకంలోని కష్టమైన గుణింతాలనుకూడా నేర్చుకొంటారు. చిన్నచిన్న వర్ణనలతోకూడిన వ్యాసాలను వ్రాస్తారు. చిన్నపిల్లలకోసం ప్రత్యేకంగా వ్రాయబడిన పత్రికలను చదవగల్గుతారు.

డ్రాయింగ్ :— వారానికొక పీరియడ్.
ఇంతకు ముందుకంటే కష్టమైన బొమ్మల్ని కాపీ చేస్తారు. ఇంకా బొమ్మలుగీసే విధానాన్ని తెలుసుకుంటూనే వుంటుంటారు.

వ్యాయామం, ఆటలు :— వారానికి రెండు పీరియడ్లు.
కసరత్తు చేయడం, ఆటలు ఆడటం.

సొంతంగా చదువుకోవడం :— వారానికి పదిహేడు పీరియడ్లు.
వారానికొకసారి డైరీ వ్రాయాలి.

హోం వర్క్ :— రోజుకు ఒకటిన్నర గంట.

తోట పని :— వారానికి 80 నిమిషాలు.
ఇష్టమైతేనే చేయవచ్చు.

చేతిపనులు — లేవు.
5, 6 తరగతులనుకలిపి హయ్యర్ బేసిక్‌స్కూల్ (Higher basic School) అంటారు. పీరియడ్ 4 5 నిమిషాలు, విశ్రాంతి 10 నిమిషాలు.

ఐదో తరగతి :

లెక్కలు :— వారానికి ఆరుపీరియడ్‌లు.
ప్రయోగాత్మక సమస్యలు, లెక్కలు నేర్పే పూసల చట్రాన్ని (Abacus) వుపయోగిస్తారు. కాని దానిని ఒక ప్రత్యేక విషయంగా నేర్పరు. ఘనపరిమాణాలకు సంబంధించిన లెక్కలు నేర్పుతారు.

చైనీస్ భాష :— వారానికి పన్నెండు పీరియడ్‌లు. ఇందులో చేతివ్రాతకు ఒక పీరియడ్, కాంపోజిషన్‌కు రెండు పీరియడ్‌లు. వర్ణనలతో కూడిన కాంపోజిషన్లుకాక, పూర్తి వ్యాసాలు వ్రాస్తారు. పాఠ్య పుస్తకంలోని పదాలనన్నింటిని తెలుసుకోగల్గుతారు. పత్రికను చదివి సారాంశాన్ని స్వతంత్రంగా చెప్పగల్గాలి.

ప్రకృతి పరిశీలన :— (Nature Study) ప్రకృతి విషయాల్నిగూర్చి తెలుసుకోవడానికి వారానికొక పీరియడ్. గాలి, భూమి, చిన్న చిన్న మెకానికల్ సూత్రాలు తెలుసుకొంటారు.

భౌగోళికశాస్త్రం :— భౌగోళికశాస్త్రం వారానికొక పీరియడు.
చైనాలోని వివిధ ప్రాంతాల భౌగోళిక్ పరిస్థితి, శీతోష్ణస్థితి తెలుసు కొంటారు.

వ్యవసాయం :— వారానికి రెండు పీరియడ్‌లు. శీతోష్ణస్థితి, ఎరువులు, పశువులు, కోళ్లు మరియు ధాన్యము గురించి తెలుసుకొంటారు. సిద్ధాంతము మాత్రమే. ఆచరణ వుండదు.

డ్రాయింగ్ :— వారానికొక పీరియడ్. నీళ్లతోకలిపిన రంగులతో బొమ్మలు వేయడం మొదలు పెడతారు. మొదటిసారిగా రంగులువాడటం మొట్టమొదటిసారిగా వారి ఊహాచిత్రాలను గీయడం మొదలు పెడ్తారు.

సంగీతం :— వారానికొక పీరియడ్. సామూహిక గీతాలు. కొత్త సిద్ధాంతముగూడా నేర్చుకొంటారు.

వ్యాయామం, ఆటలు... :— వారానికి రెండు పీరియడ్‌లు. బంతి ఆటలు, ఈత, పరుగు, వ్యాయామం (Athletics) లాంటివి నేర్చుకొంటారు.

సొంతంగా చదువుకోవడం :— వారానికి 15 గంటలు.

తోటపని :— స్కూల్ టైమ్ అయినతరువాత వారానికి 30 నిమిషాలు. స్కూలు తోటని జాగ్రత్తగా చూడటం.

చేతిపనులు :— స్కూలుటైం తరువాత తీరికసమయంలో ఎప్పుడైనా చేసుకోవచ్చు. పీరియడ్స్‌ని నిర్ణయించలేదు. ఇండియన్ ఇంక్ రంగుకు కావలసిన రాళ్లను తయారుచేయడం, కొంత చెక్కపని.

హోంవర్క్ :— రోజుకు ఒకటిన్నరగంట.

6 వ తరగతి :

లెక్కలు :— వారానికి ఆరు పీరియడ్‌లు. దశాంశపద్ధతి. భిన్నాలు, ఏక్కాలు, బుక్-కీపింగ్.

చైనీస్ భాష :— వారానికి 12 పీరియడ్‌లు. ఇందులో చేతివ్రాతకు ఒక పీరియడ్. కాంపోజిషన్‌కు రెండు పీరియడ్‌లు. ఒకవ్యక్తిని, ఒకదృశ్యాన్ని వర్ణించడం, సరియైనపద్ధతిలో, చక్కటి శైలిలో వ్రాయడం నేర్చుకొంటారు. ఖచ్చితమైన పెకింగ్ వుచ్చారణతో గట్టిగా చదువుతారు.

ప్రకృతి పరిశీలన :— వారానికి ఒక పీరియడ్. గాలి, భూమి, చిన్న చిన్న మెకానికల్ సూత్రాలు తెలుసుకొంటారు.

చరిత్ర :— వారానికి రెండు పీరియడ్‌లు. చైనీస్ చరిత్రమాత్రమే చదువుతారు. పెకింగ్ ఆదిమ మానవునినుండి భవిష్యత్తులోకి గొప్ప అడుగు (Great Leap Forward) వరకు చరిత్ర వుంటుంది.

వ్యవసాయ శాస్త్రం :— వారానికి ఒక పీరియడ్. శీతోష్ణస్థితి, ఎరువులు, పశువులు, కోళ్లు, ధాన్యం గురించి సిద్ధాంతాలు తెలుసుకొంటారు.

డ్రాయింగ్ :— వారానికొక పీరియడ్. ఇంకాస్త కష్టమయిన చిత్రాలు గీస్తారు.

వ్యాయామం, ఆటలు... :— వారానికి రెండు పీరియడ్‌లు. బంతి ఆటలు, వ్యాయామం (Atheltics).

సంగీతం :— వారానికొక పీరియడ్. పాటలుపాడేవిధానం తెలుసుకొంటారు.

తోటపని :— స్కూలుటైం అయినతర్వాత వారానికి 80 నిమిషాలు తోటపని చేస్తారు.

చేతిపనులు :— తీరిక సమయాల్లో ఎప్పుడైనా చేయవచ్చు. పీరియడ్స్ నిర్ణ

యించలేదు. మట్టిపని, ఇండియన్ ఇంక్ రంగుకు కావలసిన రాళ్ళు తయారుచేయడం, తేలికయిన చెక్కపని:

హోంవర్క్ :— రోజుకు ఒకటిన్నరగంట.

విద్యాసంవత్సరం ఆగష్టు 1 న మొదలై జూన్ 20 న ఆఖరవు తుంది. వారానికి ఆరు రోజులు స్కూలు పని చేస్తుంది. ఆదివారాలతో సహా సంవత్సరానికి 75 సెలవుదినాలు. మొత్తం 8 జాతీయ సెలవుదినాలు. అక్టోబరు జాతీయ దినోత్సవానికి రెండు రోజులు, మేడే, నూతన సంవత్సరప్రారంభం, అంతర్జాతీయ బాలల దినోత్సవం, వసంతోత్సవాలకు 3 రోజులు.

సెలవులలో టీచర్లు ఫ్రీగా వుంటారు. వాళ్లవాళ్ల యిష్టాన్నిబట్టి ఇళ్లకు వెళ్లడంగాని, ఇంకేమైన ప్రదేశాలకు వెళ్లడంగాని, ఇంకా చదువుకోవడంగాని చేస్తారు.

దూరప్రాంతాలనుండివచ్చే పిల్లలు భోజనాన్ని వెంట తెచ్చు కొంటారు. స్కూల్లో వంటవాళ్లు దాన్ని వేడిచేసి పెడతారు. మధ్యాహ్నపు విశ్రాంతి సమయంలో నిద్రపోయేందుకు బాల బాలికలకు ప్రత్యేకంగా గదులున్నవి.

విద్యార్థుల తల్లిదండ్రుల నుండి కొంత ఫీజు వసూలు చేస్తారు. టర్మ్ (Term) కు విద్యార్థికి శిక్షణ ఫీజు క్రింద ఒక యువాన్ (దాదాపు రు. 3-00) వ్యాయామం ఖర్చుల కింద అర్ధయువాన్. త్రాగే వేడినీరుకు ఒకటిన్నర యువాన్, శీతాకాలం వేడికోసం వుపయోగించే ఇంధనానికి ఒకటిన్నరయువాన్ వసూలుచేస్తారు. స్కూల్లో పనిచేసే టీచర్లందరికి జిల్లా అధికారులే జీతాలిస్తారు. అందరికంటే ఎక్కువ జీతంవచ్చే టీచరుకు నెలకు 49½ యువాన్లు (అనగా రు. 135 లు), తక్కువవచ్చే టీచరుకు 35 యువాన్లు అనగా రు. 95 లు. యిస్తారు. టీచర్ విద్యార్హతలు, అనుభవాన్నిబట్టి జీతం నిర్ణయిస్తారు. జీతానికి సంబంధించి టీచర్ల అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకొంటారు. టీచర్లు వుండటానికి వుచితంగా ఇళ్లు యిస్తారు. ప్రభుత్వపు ఖర్చుపై

వంటమనిషినిగూడా యిస్తారు. సెలవుల్లోకూడా పూర్తి జీతం యిస్తారు.

ప్రతి టీచరు పాఠాలు చెప్పడమేకాకుండా, వారానికి తొమ్మిది గంటలు తప్పనిసరిగా యితరవిషయాలగురించి చదువుకోవాలి. పిల్లల్ని శారీరకంగా ఎలాంటి పరిస్థితులలోను శిక్షించకూడదు. పిల్లలమీద చేయెత్తడం తప్పు. సమస్యలేమయినావుంటే పిల్లలతోటి, వాళ్ళ తల్లిదండ్రులతోటి చర్చిస్తారు. బట్టీపట్టించే పద్ధతి లేదు. తనంతటతానుగా చదువుకొనేలా పిల్లలలో ఆసక్తిని కలిగిస్తారు. పరిశుభ్రత గురించికూడా పిల్లలకు చెప్తారు.

[ఇది Jan Myrdal వ్రాసిన "REPORT FROM A CHINESE VILLAGE" అనే పుస్తకంలో 365—391 పేజీలలో "THE SCHOOL" అనే భాగానికి సంక్షిప్త స్వేచ్ఛానువాదం. దీనిని 1967 లో Pelican Books వాళ్ళు పబ్లిష్ చేసారు.]

వెలువడింది

విప్లవ రచయితల సంఘం,

గుంటూరు జిల్లా కమిటీ ప్రచురించిన

పాణిగ్రాహి జముకులకథ

ముందుమాట : కామ్రేడ్ సత్యం

పాణిగ్రాహి, చినబాబుల జీవిత చరిత్రలు } కామ్రేడ్ కొల్లా వెంకయ్య

పాణిగ్రాహి, చిన్న, హేమచంద్రల ఫోటోలతో

72 పేజీలు వెల : రూపాయి

ప్రతులకు :

1. ఆర్. కిరణ్‌బాబు, 2-18 బ్రాడీపేట, గుంటూరు—522002.

2. సృజన హనుమకొండ వరంగల్—506001

కుట్ర?

శివసాగర్

న్యాయమూర్తులంగారూ!

సూర్యోదయం కుట్రకాదు
సూర్యుడు కుట్రదారుడు కాడు
నిండుచూలాలి ప్రసవవేదన కుట్రనంటారా?
చరిత్ర రథ గమనాన్ని ఏమంటారు?

న్యాయమూర్తులంగారూ!

భూమిని చాపచుట్టగాచుట్టి
చంకనబెట్టుకున్న రాక్షస భూస్వామ్యం కుట్ర
నా దేశాన్ని విదేశాలకు తెగనమ్మే
దళారీతనం కుట్ర
కోసిగిన్ కుష్టు పాదాలవద్ద
స్నేహ వొప్పందం కుట్ర
నిక్సన్ ఓడలుతెచ్చే
ఆహారంలో కుట్ర
భారత స్వాహాతంత్రం కుట్ర
బ్యాలెట్ బాక్స్ కుట్ర
గరీబీ హటావో కుట్ర
ఇందిరమ్మ మందహాసం కుట్ర
సూర్యుణ్ణి ఉరితీసేందుకు పొంచివున్న
ఈ న్యాయశాస్త్రం అరమోడ్పు కన్నుల్లోని
అహంభావంలో కుట్ర

న్యాయమూర్తులంగారూ!

శ్రీకాకుళ సూర్యోదయం కుట్రకాదు
గెరిల్లా సూర్యుడు కుట్రదారుడు కాడు

చీకట్లను చీల్చటంకదా సూర్యోదయం
వేడీవెలుతురూ ప్రజలకు పంచటంకాదా
సూర్యోదయం

న్యాయమూర్తులంగారూ!

మీరు బహుమంచివారే
అధర్మ నిధనంలో యమధర్మరాజంతటివారు.

మా-నవవాదం

కె. వి. రమణారెడ్డి

సోవియట్ అణుసైంటిస్టు సఖరాఫ్ పట్టి పట్టపగటికల గంటున్నాడు★
సోషలిస్ట్ థియరి(విజని)స్టు సుస్లాఫ్ (దు)దూరాలోచన గావిస్తున్నాడు
పార్టీబాస్ బ్రేజ్నేఫ్ ప్రీమియర్ కొసిగిన్ స్వాధిక్య అదురదాపుట్టి ఛస్తున్నారు
సుప్రీం సోవియట్ పాలసీ పెసరట్టు తిరగేస్తూంది ఆర్థికం పుల్టాసీదా అవుతూంది

శాంతియుత సహజీవనం
మార్కెట్ ఆర్థిక విధానం
స్వదేశ సౌభాగ్యం
సర్వలోక (శ్మశాన) శాంతి!

★ సఖరాఫ్ పట్టపగటి కలగంటున్నాడని సోవియట్ పత్రిక 'లిటరరీ గెజట్' సంపాదకుడైన చాకో వస్కీ విమర్శించాడు. వసుధైక ప్రభుత్వం ఏర్పడితే దానిద్వారా విశ్వశాంతి సాధ్యమౌతుందని ఆశాభావం ప్రకటిస్తూ, సఖరాఫ్ 1968లో 'థాట్స ఆన్ ప్రోగ్రెస్, పీస్‌ఫుల్ కో ఎగ్జిస్టెన్స్, ఇంటలెక్చువల్ ఫ్రీడం' అనే వ్యాసం రాశాడు. అది సోవియట్ రివిజనిస్టులకుగూడా మింగుడు పడలేదు! అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు మార్క్సిజాన్ని విడనాడడంలో వారు ఒకరితల మరొకరు తన్నుకున్నారు. ఆర్థికరంగంలోనూ భౌతిక జీవనంలోనూ వచ్చిన రివిజనిస్టు మార్పుల విషఫలం సోషల్ ఇంపీరియలిజం. అది భావలోకాన్నిగూడా వ్యాధిలా సోకసాగింది. పునాదితోబాటు భావజాలంకూడా శీమార్పుకు లోనవుతున్నాయి. ఇది క్షయకాదు, కుష్ఠు.

బక్క దేశాల డొక్క లెండనీ మనకేం? పితృదేశం మాత్రం ధనకోశంకావాలి
పీడితులు తిరగబడి చెడనీ, మనకేం? మహాప్రజ మనది మహత్తరంకావాలి
స్వాతంత్ర్య సంగ్రామాలు భంగపడనీ, మనకేం? జగన్నాయకత్వంలో అర్ధవాటామనది
సమానతా ఆశయాలు రక్తసిక్తంగానీ, మనకేం? తోడిడి పేరిటి దోపిడీ మనది

సోషలిస్టు అంతర్జాతీయత-సోవియట్‌కు నైవేద్యం
వార్సా సైనిక సంధి - ఉపగ్రహరాజ్యాల మెడలోగుది
సోషలిస్టు శ్రమవిభజన - కోమెకాన్‌కు చెక్కభజన
పాక్షిక సార్వభౌమాధికార సిద్ధాంతం - సోషల్ సామ్రాజ్యవాదం!

పచ్చి అవకాశవాద మార్క్సిజమై 'సృజనాత్మక' మార్క్సిజం వర్ధిల్లుగాక
పరమ సైతానిజమై స్వార్థిజమై హెజిమనిజమై లెనినిజం వర్ధిల్లుగాక
పూరా దోషలిజమై సోవియట్ బ్రాండు సోషలిజం వర్ధిల్లుగాక
ప్రపంచ వంచనాయిజమై పుచ్చి రివిజనిజమై గోముఖ వ్యాఘ్రిజమై వర్ధిల్లుగాక

పనికి ఆర్థిక ప్రోత్సాహాలు, గార్డెన్‌ప్లాట్లు
సమిష్టి వ్యవసాయ క్షేత్రాల వ్యష్టి ఆస్తులు
స్వచ్ఛంద మార్కెట్‌లో ధరవరల నిర్ణయం
స్వలాభసూత్రంపై పరిశ్రమల దుర్నయం!

కాట్స్కీ బొర్రనూ కృశ్చేఫ్ బుర్రనూ గోరీల్లో తృప్తిగా తడుముకోనీ
టిటో హేట్‌నూ డాంగే స్లాక్‌షర్టునూ సంబరంగా గాలిలో ఎగరెయ్యనీ
మార్క్సిజం డాగ్మాటిజంగా, మావో పెటీబూర్జువా రివల్యూషనిస్టుగా దూరుబడనీ
మార్కెట్ ఇకానమీద్వారా సోషలిజంశవంమీద కేపిటలిజం లేచి నిలబడనీ

స్టాలిన్ సమాధి మార్పిడి
బుఖారిన్ భావభూతం ఏలుబడి
పునాదినితవ్వే పాత పందికొక్కులు
అసలుకే ఎసరుపెట్టే సంస్కరణ ట్రిక్కులు!

జాతీయ విమోచన పోరాటాలు ఏమైతేనేం? 'నేషనల్ డెమోక్రసీ'కీ మద్దత్తు
దీర్ఘకాలిక సాయుధ ప్రజాపోరాటాలేమైతేనేం? 'శాంతియుత పరివర్తన' గమ్మత్తు
కమ్యూనిజం గమ్యం మృగతృష్ణమాత్రమైతేనేం? 'న్యూక్లాస్' కోటలోనే పాగా
సిద్ధాంతం రాద్ధాంతమై సూత్రం తెగిపోతేనేం? 'బ్యూరాక్రసీ'కే ఎక్కువజాగా

స్టేట్ ఆఫ్ ది హోల్ పీపుల్
క్లాస్‌లెస్ సొసైటీ
కమ్యూనిజం వీధిమలుపులోనేఉంది
ఇంతలో నందికూడా ఊరబందిగా మారింది!

త్యాగాలకు వెనుదీయం

పాణిగ్రాహి సుబ్బారావు

బ్రతుకంతా భారం కూరిరం
ప్రమాదాల తీరం ఘోరం
పుట్టడమే మహాపాతకం
చావే యిక మేలనుకుంటూ
నిరుత్సాహ పడబోకండోయ్
నిస్పృహగా వాపోకండోయి బ్రి॥

వీరచరిత్రి చూచుక నడవని
నిరుత్సాహి నీరసమాడు
యుగయుగాల మానవ కథనం
స్వర్గానికి రోడ్డేస్తున్నాం బ్రి॥

ఎడారిలో ఎండలకోర్చి
దాహంతో పనిచేశాము
పడుచువాళ్ల వుష్ణ రక్తం
పులులకు బలిచేసేశాం
కష్టాలకు భయపడ్డామా
త్యాగాలకు వెనుదీశామా బ్రి॥

కష్టానికి నిస్పృహపడితే
అసలెందుకు మొదలెట్టావోయ్
కష్టకాలమంతా గడిచి
కాస్త లోన వదిలెస్తామా బ్రి॥

యీకాస్త బద్దకించకోయ్
నరకంలో పడిపోతావు
పలుగులతో బండలు పొడచి
పగలంతా కష్టంకోర్చి
బండచాకిరి నెత్తి మోసి
ఎంతకాలం ప్రక్కన చస్తావ్ బ్రి॥

నవల - ప్రజలు

రాల్ఫ్ ఫాక్స్

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

ప్రథమాధ్యాయం

ఉపోద్ఘాతం

కళకూ జీవితానికీగల విస్తృత సంబంధం గురించి సవివరంగా ఈ వ్యాసంలో చెప్పగలనన్న భ్రమలేవీ నాకులేవు. ఇంగ్లీషు నవల యొక్క ప్రస్తుత పరిస్థితి పరిశీలించడమన్న పరిమిత లక్ష్యంతో మాత్రమే యీ వ్యాసం రాస్తున్నాను. ఏ పునాదిపై ఇంతకుపూర్వం సుస్థిరంగా నవల ఆధారపడివుందో, ఆ పునాదిని మొదలంటా కదలించి వేసిన భావసంక్షోభం (crisis of ideas) గురించి అర్థం చేసుకోడానికి యీ వ్యాసం ఒక ప్రయత్నం మాత్రమే. అలాగే నవలకుగల భవిష్యత్తు గురించి యీవ్యాసంలో పరిశీలిస్తాను.

వర్తమాన సరిస్థితులలో నవలాప్రక్రియ కొన్ని యిబ్బందులకులోనైనా, దీనికి మంచి భవిష్యత్తు కలదని మాత్రం నేను నమ్మతాను. నవల మన నాగరికతకు చెందిన మహత్తర ప్రజా కళారూపం. ఇది మహాకావ్యానికి (epic) వారసురాలు. ఇది మన పూర్వీకుల మహత్తర కావ్యాలకు వారసురాలు. దీనికి మరణంలేదు. జీవిత మంటే మార్పు. కళారంగంలోకూడా మార్పు ఎప్పుడూ మంచేకానక్కరలేదు. నవల చైతన్యవంతంగా వుండాలంటే అది కొన్నిమార్పులు చెందాలి. ఆ మార్పులగురించిన చర్చే ఈ గ్రంథం.

మానవచరిత్రలో, వినూత్నమైన కళారూపాలు ఉదాహరణకు సినిమాలాంటివి జన్మించాయి. కాని యిప్పటివరకు ఏ కళాప్రక్రియ పూర్తిగా అదృశ్యం కాలేదు. విస్తరించిన తన చైతన్యపరిధి నుంచి మనిషి కుంచించుకుపోవాలనిచూడడు. తాను నివసిస్తున్న వాస్తవిక ప్రపంచంపట్ల తన వేదనను (sensitivity) ఇనుమడింపచేసే కళారూపాలన్నిటిని మానవుడు అభిమానిస్తాడు. వాటిని ఉపయోగించుకుంటూ వుంటాడు. నవలకూడా ఒక వినూత్నమైన కళారూపం. ఈ ప్రక్రియకు మూలాన్ని Trimalchio వ్రాసిన Banquet నుంచి Daphnis and Chlve వరకూ, అంతకంటె ప్రాచీనుడైన హెరొడొటస్ (Herodotus) లోను చూడవచ్చు. కాని నవల ఒక కళారూపంగా,

తానే రూపొందించుకున్న నియమ నిబంధనలతో జగద్విఖ్యాతిగాంచిన ప్రక్రియగా మన నాగరికతనుండి జన్మించిందే, మన అచ్చుయంత్రం నుంచి పుట్టిందే.

నవల, సారస్వతంలో ఒక భాగం. నిజమే. కాని నాటక ప్రక్రియకూడా ఒక విధంగా అంతే. నాటకానికి కళారూపంగా గల ఉన్నత స్థానాన్ని ఎవరూ తిరస్కరించరు. నవలంటే కల్పనాత్మక వచనం (fictional prose) మాత్రమే కాదు. అది మానవ జీవితానికి అద్దంపట్టే వచనం. మనిషి జీవితం మొత్తం బాపోసన పట్టి, తరచి చూచి, ఆ జీవితాన్ని చిత్రించడానికి ప్రయత్నించిన మొట్ట మొదటి కళాప్రక్రియ నవల. ఇతర కళారూపాలముందు నవలకు గల గొప్పతనం ఏమిటంటే, ఇ. ఎమ్. ఫాస్టర్ (E. M. Forster) చెప్పినట్లు, నవలకు మనిషి రహస్య జీవితాన్ని కళ్ళకుకట్టినట్లు చూపించగల శక్తి వుంది. కనుక కవిత్వంగాని, నాటకంగాని, సినిమాగాని, చిత్రలేఖనంగాని, సంగీతంకాని చూపించని ఒక విభిన్నమైన వాస్తవికతాదృక్పథాన్ని నవల మనకు చూపించగలదు.

పై కళాప్రక్రియలన్నీ వాస్తవికాంశాలను నవలకంటే బాగా ప్రదర్శించవచ్చు. కాని పై ప్రక్రియలలో ఏ ఒక్కటికూడా ఒక వ్యక్తియొక్క సమగ్ర జీవిత చిత్రణను సంతృప్తికరంగా చేయలేదు. ఎందువల్ల అన్న ప్రశ్నకు సమాధానం తర్వాతచూదాం. ప్రస్తుతానికి, పాఠకులు ఈ విషయాన్ని అంగీకరిస్తే చాలు.

నవలా ప్రక్రియ గురించి, వ్యాసాలు గ్రంథాలు రాయాల్సినంతటి సంక్షోభం నవలా ప్రపంచంలో వాస్తవానికి వుందా? వుంటే ఆ సంక్షోభం నివారించడానికి ప్రయత్నించాల్సిందే. ప్రమాదకరమైన మార్గంలో ఎవరైనా పోతున్నట్లు మనం గమనించినపుడు, వారిని గట్టిగా కేకవేసి హెచ్చరించడం మన కర్తవ్యం. అవును. నవలలు రాయడమే వృత్తిగా గల రచయితలు, వాటిని ప్రచురించే వ్యాపారస్థులు, ఇంగ్లీషు నవలస్థాయి పతనమైందని అంగీకరించారు. ఇంగ్లీషు నవల తన మార్గాన్నీ, లక్ష్యాన్నీ మరచిపోయిందన్న నిర్ణయానికి వారు వచ్చారు. ఒకప్పుడు విస్తృతంగా చదువబడిన నవల, ఇప్పుడు చదవటానికి పనికిరాని స్థాయికి అతిత్వరితంగా దిగజారిపోతోంది.

అంటే అణా, పావలా అద్దె గ్రంథాలయాలలో నవలలు ఎవరూ చదవటంలేదని కాదు. గతంకంటే ఇప్పుడే ఎక్కువ నవలలు చదువబడుతున్నాయి. కాని చదవకూడని పనికిరాని నవలలను పాఠకులు చదువుతున్నారు.[1] నవల భవిష్యత్తుపై ఆసక్తి కలవారికి, ఇంత క్లుప్తంగా అర్థంగాకుండా చెప్పి ముగించడం నా అభిమతం కాదు. ప్రస్తుత పరిస్థితిని నాకర్థమైనంత వరకు వివరిస్తాను.

నేటి నవలలలో గుణాత్మకమైన సంక్షోభం (crisis of quality) వచ్చింది. నిజానికి జనాదరణ పొందే నవలలు పూర్వంకంటే యిప్పుడు ఎక్కువ వస్తున్నాయి. మనలను ఊహాలోకాల్లో విహరింపచేస్తూ చక్కిలిగింతలుపెట్టే యీ నవలలను మనం రేడియోముందు కూచుని ఏకబిగిని చదివేస్తాం. అంతేకాదు బస్సుల్లో, బస్టాండుల్లో, రైళ్ళల్లో, రైల్వేస్టేషన్లలో, బీచిలో యీ నవలలను ఒక్కసారంటే ఒక్కసారే చదివి అవతల పారేస్తాం. మరల మనం దానిజోలికిపోము. మరోసారి దానిని చదవాల్సిన అవసరం కనపడదు. కాకపోతే ఆ నవల చదివిన సంగతి మరచిపోయి వుంటే, దానిని చదివినట్లు జ్ఞాపకం వచ్చేవరకు మరల ఒకసారి దానిని చదువుతామేమో। మనం యిటువంటి నవలలగురించి చర్చింపబోవడంలేదు. ఎందుకంటే యీ నవలలు వాస్తవిక చిత్రిణ చేయవుగనుక.

కాని ఈ నవలల రచయితలుకూడా వాస్తవికప్రపంచాన్ని చిత్రించడానికి ప్రయత్నిస్తారు. కాని వారు ఆవిష్కరించకల్గిన వాస్తవికత, మన ఉద్రేకాలను ఊపివేసి, మన మనస్సులను చైతన్యవంతం చేసి, కళ్ళుతెరిపించి, వాస్తవాలను చూడగల్గేట్లు చేయలేదు. నిజానికి అటువంటి అనుభూతిని నవల మనకు కల్గించకల్గితే ఆ అనుభూతిని, నవలను మనమెన్నటికీ మరువమే.

కొన్ని ఎకరాల విస్తీర్ణంకల్గి అస్తవ్యస్తంగావున్న యీ నవలా క్షేత్రాన్ని, ఈనాటి సమీక్షకారుడు ప్రతివారం దున్నుతూ మంచి ఫలితం మాత్రం సాధించలేకపోతున్నాడు. సిరిల్ కొనల్లీ (Mr. Cyril Connolly) అనే సమీక్షకరుడు తాను సమీక్షించే పుస్తకాలను చదువలేక పోతున్నానని మొహమాటంలేకుండా చెప్పాడు. అతనురాసే సమీక్షలలో అతని స్వంతబాధల నేకరువుపెట్టడంవల్ల ఆ సమీక్షలు ఆసక్తిదాయకంగా వుంటాయిగాని, అతను తాను చదివిన నవలల గురించి రాయటంవల్ల మాత్రం కాదు.

విచిత్రమేమిటంటే ఈ చెత్తపుస్తకాల వరద పాఠకలోకం పెరిగినందువల్ల వచ్చిందికాదు. ప్రచురణకర్తలు తమ అభిరుచులకు (లాభాలకు॥అను॥) తగినట్టుగా పుస్తకాలను ప్రచురించడంవల్ల ఈ చెత్త పుస్తకాలు వరదనీటిలా వస్తున్నాయి. పాఠకుని అభిరుచికి తగ్గ పుస్తకాలు రావటం ఇక కష్టం. పెద్ద ప్రచురణ సంస్థలనుంచి లభించే పుస్తకాలపైనే పాఠకులు తమ అభిరుచి పెంపొందించుకోవాలి.

బ్రహ్మాండమైన ఈ ప్రచురణ సంస్థలకు, సాధారణంగా స్వంతప్రెస్సు, బైండింగ్‌శాఖ వుంటాయి. అంతేగాక, ఆధునికయుగంలో వ్యాపారానికి కావాల్సిన ముఖ్య

తిముఖ్యమైన సౌకర్యం బ్యాంకులో ఓవర్‌డ్రాఫ్టు పొందే సౌకర్యం ఈ ప్రచురణ సంస్థలకు వుంటుంది గనుక ప్రచురించిన పుస్తకాలు వెంటనే అమ్ముడుపోవాలి. ఈ సంస్థలకు ఎక్కువెక్కువ పుస్తకాలు— ముఖ్యంగా నవలలు కావాలి. ఎందుకంటే నవలారచయితకు యితర రచయితలకులాగా ఎక్కువ ముట్టచెప్పనక్కర్లేదు. నవలలను చాల తక్కువఖర్చుతో ప్రచురించవచ్చు. ప్రచురించినవెంటనే ఆ నవలలలో స్వయంప్రతిభ (originality) ఎంత తక్కువుంటే అన్ని ఎక్కువ కాపీలను గ్రంథాలయాలకు అమ్ముకోవచ్చు.[2]

ప్రచురణకర్తలకు పోటీ మార్కెట్ వుంటుంది గనుక వారు తమతమ కేటలాగుల్లో ఎక్కువెక్కువ పుస్తకాలు చూపించాలి. తమ ప్రెస్సులకు పనికల్పించడానికి వీరు ఎక్కువెక్కువ పుస్తకాలు అచ్చుకు పంపుతూవుండాలి. ఒకవేళ స్వంత ప్రెస్సులు లేకపోతే, వాళ్లు వాడుకగా అచ్చువేయించే ప్రెస్సువాళ్ళను సంతృప్తిపరచడానికైనాసరే పుస్తకాలు అచ్చువేయించాలి. ఎటువంటి పుస్తకాలు అచ్చువేయిస్తున్నారన్నది వాళ్లకు అనవసరం. అది ఒక మహాగ్రంథమే కానీండి లేక బూతుపురాణమే కానీండి— ఒకే రకమైన కాగితం వాడతారు. ఒకేవిధంగా బైండ్ చేస్తారు. ఖరీదైన జాకెట్ పేపర్ వాడతారు. ఆ గ్రంథాలయాలకే అమ్ముతారు. అది ఎటువంటి పుస్తకమైనా కానీండి, ప్రచురణకర్త మాత్రం దానిని ఉత్తమగ్రంథమని ప్రచారం చేస్తాడు. ఇక పుస్తక సమీక్షకులు మంచి చెడులను పరిశీలించగలమన్న ఆశను ఏనాడో తుంగలో తొక్కడం వల్ల ప్రచురణకర్త ప్రచారంచేసిన అభిప్రాయాన్నే గౌరవించి, ఒక్కోసారి తమ మూడ్‌నుబట్టి లేక తమకూ ప్రచురణకర్తకూ గల వ్యక్తిగత పరిచయాలబట్టి గ్రంథ సమీక్ష చేస్తారు.

ఈ గ్రంథ ప్రచురణా బృహద్వ్యాపారమనే లాభాల ఆటలో అసలు రచయిత అనామకుడై పోయాడు. ఒక రచయిత పుస్తకాలు బాగా అమ్ముడుపోతే అతనికి కొంత పేరు వస్తుంది, దానివల్ల అతనికి కొంత స్వేచ్ఛ లభిస్తుందిగాని, ఈ వ్యాపారంలో అతనూ ఒకభాగమైపోతాడు. ఎలాగంటే పేరువచ్చిన రచయిత పేరు వ్యాపారంలో ప్రచారానికి పనికివస్తుంది. పుస్తకవ్యాపారరంగం ఇప్పుడతనికి కొంత హోదానిచ్చి గౌరవిస్తుంది. అలా చేసి మరల అతనిచేత కొన్ని పుస్తకాలు రాయించుకొని, మరల డబ్బుచేసుకుంటారు ప్రచురణకర్తలు.[3]

పుస్తకాల గురించి ప్రచారం (Publicity) చేయడం గురించి చాల చెప్పవచ్చు. 'ఈనెల పుస్తకం' క్లబ్బులూ, రికమెండేషన్లూ, సారస్వతంపై రేడియో ప్రసారాలూ,

ప్రెస్సుల నిర్వహణలాంటివే కాక యింకా ఎన్నో రకాల ప్రచారసాధనాలున్నాయి. కాని ఈ వ్యాస లక్ష్యం వాటి వివరణ కాదు.

పుస్తక ప్రచురణ ప్రస్తుతం ఒక పెద్ద వ్యాపారంలో ఒక అంతర్గతభాగం అన్న సత్యాన్ని ఒక రచయితగా లేక పాఠకునిగా మనం తెలుసుకోవడం అవసరం. మన పెద్దలు చెప్పినట్లు 'జీవిత వాస్తవాల' (facts of life) ను గురించి ఉచ్ఛదశకు వచ్చిన ప్రచురణ కర్తలను తెగడటం మన బుద్ధితక్కువ తనాన్ని నిరూపిస్తుంది. కాని సారస్వతంపై, ప్రత్యేకంగా నవలలపై వీరి ప్రభావం చాల హేయమైనదని గమనించడం మాత్రం అవసరం. పుస్తక వ్యాపార లక్ష్యాలలో గుణం (Quality) ఏనాడో అదృశ్యమైపోయి, దానిస్థానాన్ని 'పరిమాణం' (Quantity) ఆక్రమించింది.

ఇదేగాక మరో ముఖ్యమైన సంక్షోభం వుంది. నవలాకారులలోనే దృక్పథ సంక్షోభం వుంది. చెత్త నవలలు చెత్త చెత్తగా వరదలా వస్తున్నాకూడా మరో ప్రక్క చిత్తశుద్ధిగల రచయితలూ, ఉత్తమ నవలాకారులు రచనలు సాగిస్తున్నారు. డి.హెచ్. లారెన్స్ మొన్న మొన్ననే మరణించాడు. జేమ్స్ జాయిస్, ఇ.ఎమ్. ఫార్స్టర్ (E M. Forster) ఇంకా జీవించే వున్నారు. రెబెకావెస్ట్, ఆల్డస్ హక్స్లీ ఇంకా మరికొందరు చిత్తశుద్ధితో, సీరియస్‌గా ఆలోచిస్తూ నవలలు రాస్తున్నారు. వాళ్ళ రచనలు వ్యాపార రంగంలో విజయం సాధించినవా లేదా అన్నది మనకిప్పుడు అప్రస్తుతం.

చిత్తశుద్ధిగల రచయిత ఈనాడు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు చాల ఎక్కువ. ఇతర కళాకారులకంటే రచయిత తనదేశం గురించి ఇతరులకు ఎక్కువ వివరిస్తాడు. అతని నవలలు అనువదింపబడి ప్రపంచమంతా చదువబడుతాయి. ఇంగ్లండు గతం గురించి వెల్స్, కిప్లింగ్, గాల్స్‌వర్దీ, కాన్రేడ్‌ల నవలలు చదివి విదేశస్థులు ఒక నిర్ణయానికి రాగలరు. ఈనాటి ఇంగ్లండును హక్స్లీ రచనలద్వారా అర్థంచేసికోగలరు. హక్స్లీ తర్వాత రాస్తున్న యువరచయితల పుస్తకాల అనువాదాలనుకూడా చాలమంది విదేశీయులు గుర్తించి ఈనాటి ఇంగ్లండును వాటి ద్వారా అర్థంచేసికుంటున్నారు.

కనుక నవలా రచయితకు తనదేశపు వర్తమాన చరిత్రపైనా, తనదేశపు గత చరిత్రపైనా ప్రత్యేకమైన బాధ్యతవుంది: గతకాలం నుంచి అతనుపొందే వారసత్వాన్ని ముఖ్యమైనదిగా పరిగణించాలి. ఎందుకంటే ప్రస్తుత సమాజానికి ఉపయోగపడే ఒక దేశపు సాంస్కృతిక వారసత్వపు అంశాలను అది చూపుతుంది గనుక. తన యుగ చైతన్యంలోని ప్రాముఖ్యతను అతను చెప్పగలడు గనుక. వర్తమానంపై అతనుచెప్పే దానిని ముఖ్యంగా గమనించాలి. ఇతరులు తన రచనలను ఏ దృక్పథంతో చూస్తున్నా

రన్న విషయం రచయిత పట్టించుకోనక్కర్లేదనటం మనం అంగీకరించం. కాని అతను ఏ వారసత్వాన్ని పొందుతాడో, దేనిని వ్యక్తీకరిస్తాడో అది మాత్రం అతని స్వంత వ్యవహారం అని అంగీకరించాలి.

అది అతని స్వంత వ్యవహారమే ఐనా కూడా, తన రచనపై ఇతర ప్రపంచం పొందిన అనుభూతి నుండి అతను వేరుగా వుండజాలడు. స్వార్థచింతనతోనూ, వినాశకర పద్ధతులతోనూ నిండిన జాతీయవాదం వ్యాపించిన ఈ ప్రపంచంలో చిత్తశుద్ధి, గొప్పకీర్తి కల రచయితకు జాతీయవాదం పట్లగల దృక్పథం గురించి తెలుసుకోవటం ముఖ్యం. ప్రతి చిత్తశుద్ధిగల రచయిత ఈనాడు ఇది అర్థంచేసుకుంటున్నాడు. వారిలో ఎక్కువమంది దీనిలోగల సమస్యలపట్ల ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు.

రచయిత తన మతంకోసం తన దేశాన్ని నిరసించవచ్చునా? ఎవిలిన్ వా (Evelyn Waugh) అలా చేసాడు. కాని అలా చేయడంవల్ల అతను మరో దేశపు మోసపూరితమైన జాతీయవాదపు ఒడిలో పడ్డట్లు తెలుసుకున్నాడు. జర్మనీ తర్వాత జర్మనీ అంతటి దురాక్రమణదారు, స్వార్థపరత్వంతో ఎంతటి క్రూరకృత్యాలకైనా పాల్పడే దేశమైన ఫాసిస్టు ఇటలీని ఈనాడు రోమన్ కాథలిక్ చర్చి బలపరుస్తోంది. తానూ రోమన్‌కాథలిక్ కావడంవల్ల Waugh కూడా ఇటలీని బలపరుస్తున్నాడు. ఐతే 'జాతికి - రక్తానికి' గల సంబంధాల గురించి డి.హెచ్. లారెన్స్ హేతుబద్ధంగా ఋజువు చేసిన విషయాలను Waugh అంగీకరిస్తాడా? అప్పుడతడు నాజీ సంస్కృతిని, దానిం సంబంధించిన మధ్యయుగాలలోని చిత్రహింసల గదులనూ (torture chamber), యుద్ధాన్ని ఆధ్యాత్మికమైన ఉన్నతదశగా గౌరవించడాన్నీ బలపర్చడంతో Waugh తన యాత్ర పూర్తిచేస్తాడేమో!

జెసూట్ మత ప్రచారకుడైన అమరజీవి ఎడ్మండ్ కాంపియన్ (Edmund Campion) జీవిత చరిత్ర వ్రాసి Waugh, Hawthorden బహుమతి పొందాడు. ప్రతి ఇంగ్లీషు రచయిత పొందాలని ఆశించే రెండు ఉత్తమ బహుమతుల్లోనూ, ఒకదానిని Waugh పొందాడు. కాని షేక్స్పియర్‌గాని, మార్లోగాని కాంపియన్‌ను అమరజీవిగా పరిగణించేవారా? ఇంగ్లండు ఒక జాతిగా మనుగడ నిలబడటానిం పోరాడుతున్న సమయంలో, ఒక జాతీయ సంస్కృతిగా నిలబడటానికికల అవకాశాలకొరకు పోరాడుతున్న సమయంలో, కాంపియన్ చర్యలు, షేక్స్పియర్ మాటల్లో చెప్పాలంటే,

"...నేరాలకొరకే జీవించిన తెలివితక్కువ గాడిదలు- మంచితనంకోసం మరణించాడు" అన్నట్లు వుంటాయి.

నిజానికి ఈనాటి రచయిత నిజమైన జాతీయత, కేవలం జాతీయతావాదం లేక జాతి వ్యతిరేకతావాదం మధ్యగల భేదాలను చాల నిశితంగ పరిశీలించాలి. వర్తమాన మెంత విలువైందో భూతకాలమంతే విలువైంది. గతాన్ని మన యాత్రలో ఉపయోగించుకోవాలి. కాని గతం మన యాత్రలో మనం భరించరానంత బరువుగా, గుదిబండగా మారకుండా జాగ్రత్త పడాలి. గతం మనకు నిజంగా ఇచ్చే సహాయాన్ని ఎన్నుకొంటూ, మన ప్రగతికి అడ్డం వచ్చేదాన్ని అవతలపెట్టి మన ప్రయాణాన్ని సాగించాలి.

ఇక దృక్పథ సంక్షోభం తత్త్వశాస్త్రానికి సంబంధించినది. ఒక రూపానికి (form) సంబంధించినది. ప్రథమ ప్రపంచయుద్ధం ప్రారంభమైననాటినుండి, ఇంగ్లీషు రచయితల తాత్త్విక దృక్పథమంతా సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రభావంతో నిండివుంది. ఫ్రాయిడ్ వివరించిన మనోవిశ్లేషణ మనిషికి దైవత్వం ఆపాదించే ప్రయత్నమని చెప్పాలి. అది మేధస్సుకు సంబంధించిన అరాజకత్వమనవచ్చు. గత ఇరవై ఏళ్ళ కాలంలోను ఇంగ్లీషు నవలను ఈ మనోవిశ్లేషణ ప్రభావితం చేసినంత గాఢంగా మరే ఇతర భావజాలం ప్రభావితం చేయలేదు. నవలపై దీని ప్రభావంవల్ల భావాల దివాళా కోరుతనం ప్రవర్తిల్లింది. ఫ్రాయిడ్ విశ్లేషణాపద్ధతిపై వ్యక్తిత్వాన్ని రూపొందించడంవల్లనే కొన్ని స్వయం ప్రతిభగల రచనలు మంచిపేరు సంపాదించాయి.

ఈనాటి రచయిత మనస్సును కలవరపరిచే ఆఖరి సమస్య సామాజిక సమస్య. తాను నివసించే ప్రపంచంలోని సమస్యలగురించి పట్టించుకోకుండా నిర్లిప్తంగా నవలాకారుడు వుండగలడా ? యుద్ధం ప్రారంభించడానికి ముందు వినవచ్చే రణగుణధ్వనిని వినకుండా రచయిత వుండగలడా ? తన దేశపరిస్థితిని ఏ రచయితైనా చూడకుండా వుండగలడా ? వ్యక్తిగత స్వార్థం (Private greed) అనే పవిత్ర ధ్యేయ రక్షణకై ఏర్పడిన రాజ్యాంగయంత్రం, తనచుట్టూ జీవించటానికి వీలులేని భయానక పరిస్థితులను కల్పిస్తుంటే అతను మౌనంగా వుండగలడా ?

శబ్దేంద్రియం, దృగేంద్రియం, వాగేంద్రియం కళా ప్రపంచపు సంస్థానమైన ఆధ్యాత్మిక ప్రపంచానికి ఉత్తేజరహితులైన సేవకులుగా గాక, మానవప్రపంచ ప్రేరణలకు ఉత్తేజమునొందే ఇంద్రియాలుగా ఎక్కువమంది నవలాకారులు క్రమ క్రమంగా గుర్తించడం ప్రారంభించారు. మానవజాతి భవిష్యత్తు నిర్ణయింపబడుతున్న చారిత్మాత్మకమైన కాలంలో నివసిస్తున్నామన్న జాగృతికూడ వారిలోవుంది. మానవతావాదాన్ని నెత్తినబెట్టుకు తిరుగుతూ మానవుని భవిష్యత్తు గురించి ఆలోచించడం తమ కర్తవ్యం కాదన్న ఆలోచనగలవారిని ఈ నవలాకారులు తీవ్రంగా నిరసిస్తారు.

నాగరికతా భవిష్యత్తుగురించి రెండు దృక్పథాలున్నాయన్నసంగతి వీరికితెలుసు. వ్యక్తిగత ఆస్తి, యుద్ధం, స్వార్థోన్మాదంకు మారుపేరైన జాతీయ నియంతృత్వ ప్రభుత్వ యంత్రాంగంద్వారా నాగరికత తన అభివృద్ధిని సాగిస్తుందని ఒక దృక్పథం వారు నమ్ముతున్నారు. సామాజిక ఆస్తిపై ఆధారపడిన నూతన విలువల కొరకు మానవజాతి పోరాడుతోందనీ, ఈ విలువలు యుద్ధానికీ, జాతీయవాదంకూ భరతవాక్యం పల్కి వాటి స్థానాలలో జాతులు స్వేచ్ఛగా ఒకరికొకరు సహాయపడుతూ ప్రపంచనాగరికతను పెంపొందిస్తాయని మరోదృక్పథం వాళ్ళు నమ్ముతున్నారు.

ఎక్కువమంది రచయితలు కొద్దోగొప్పో ఈ రెండవ దృక్పథాన్నే బలపరుస్తున్నారు. సమ్యగ్దృష్టికల వీరిలో కొందరు, అటువంటి నూతన నాగరికత శ్రామిక వర్గ నాయకత్వాన జరుగుతున్న పోరాటఫలితంగా ఉద్భవిస్తుందని, అట్టి నాగరికతావిర్భావం సోవియట్ యూనియన్‌లో జరుగుతోందని గమనిస్తారు. ఈ దృక్పథం వీరిలో మార్క్సిజంపట్ల, విప్లవ మార్గావలంబికులైన శ్రామికవర్గ ప్రజల జీవితదృక్పథం పట్ల, 170 మిలియన్ల ప్రజల మహత్తర సోషలిస్టు రిపబ్లిక్ సమాఖ్యపట్ల ఆసక్తిని కలుగచేసింది.

రష్యా విప్లవం, శ్రామికవర్గ ఉద్యమం మంచివే ఐనా మార్క్సిజం భౌతిక వాదాన్ని నమ్ముకున్న తత్త్వశాస్త్రం కావడంవలన ఈ తత్త్వశాస్త్రం కళాత్మక వ్యక్తీకరణకు వ్యతిరేకమైన తత్త్వశాస్త్రమన్న భావం యిప్పటివరకు ప్రవర్తిల్లింది. సాధారణంగా ఇదేభావాన్ని మరోవిధంగా, 'మార్క్సిజం కళాకారుణ్ణి పిడివాదపు సంకెళ్ళతో బంధిస్తుంద'ని ప్రచారం చేస్తారు.

కాని యీ వాదాన్ని యిప్పుడంతగట్టిగా ఎవరూ చేయడంలేదు. మార్క్సిజం గురించి ప్రజలకు బాగా ఎక్కువగానే తెలిసింది. కాని మార్క్సిస్టు సానుభూతి పరుల లోనే చాలమంది ఇప్పటికీ, 'సోషలిస్టు వాస్తవికత' సిద్ధాంతానికిగానీ, 'విప్లవ నవల' సిద్ధాంతానికిగానీ, రాజకీయ నినాదాలస్థాయికంటే ఎక్కువ ప్రాముఖ్యం యివ్వటం అనవసరమన్న అభిప్రాయం కలిగివున్నారు.

ఇంగ్లీషు నవల భవిష్యత్తూ, ఇంగ్లీషు నవలాకారుని కలవరపరుస్తున్న కొన్ని సమస్యలకు పరిష్కారం, సాహిత్యంలోని వామపక్షశక్తులన్నిటిని ఐక్యపరచి బలపరచే మార్క్సిజమూ, దాని కళాసిద్ధాంతమైన 'సోషలిస్టు వాస్తవికత'లో వుందని నిరూపించడమే ఈ వ్యాసలక్ష్యం.

[రాల్ఫ్‌ఫాక్స్ గ్రంథం 'The Novel and the People' 1937 లో ప్రచురితమైన విషయం పాఠకులు గమనించాలి. అను]

అనువాదకుని వ్యాఖ్యలు

1. ప్రస్తుతం మన ఆంధ్రసాహిత్యంలో సరిగ్గా ఇదే పరిస్థితి మనం గమనిస్తాం. పాఠకులు పెరిగారు. నవలలస్థాయి అధోగతికి దిగజారింది. ఏవూళ్లో చూచినా కిళ్లీ షాపుల్లోనూ, బడ్డీ కొట్టుల్లోనూ, పాతపుస్తకాల షాపుల్లోనూ, డిటెక్టివ్ నవలలు, సాంఘికనవలలు, శృంగార నవలలు, సెక్సుపత్రికలు అద్దెకు అతి చౌకగా దొరుకుతున్నాయి. అన్నిరకాలవారు వీటిని చదువుతున్నారు.

2. జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖలు, పంచాయతీ గ్రంథాలయాలు తమ తమ గ్రంథాలయాలకు తెప్పించే పుస్తకాలను గుర్తుతెచ్చుకోండి. ప్రచురణ సంస్థలు ఈ గ్రంథాలయాధికారులకు రహస్యంగా సమర్పించుకోవాల్సిన కమీషన్‌కూడా కలిపి పుస్తకం ధర నిర్ణయించడం— ఆ ధరకు గ్రంథాలయానికి సరఫరా చేయడం— ఆ ధరకు మార్కెట్‌లో అమ్ముడుపోదుగనుక ప్రత్యేక ధర అని చెప్పి మరల మరో రేటు నిర్ణయించడం మనకు తెలుసు.

3. ఈనాటి రచయిత్రుల నవలలకున్న గిరాకీ చూడండి. కొంతకాలం రంగనాయకమ్మ, కౌసల్యాదేవి రాజ్యమేలారు. ప్రస్తుతం సులోచనారాణి, సులోచన మొదలైనవారు పరిపాలిస్తున్నారు. ప్రతి పత్రికా, ఆఖరుకు ఎంతో కొంత అభ్యుదయధోరణికి ప్రోత్సాహమిస్తుందనుకునే ఆంధ్రజ్యోతికూడా ఈ రచయిత్రుల రచనలకు పడిగాపులు పడ్తోంది. ప్రతి పత్రికా సంపాదకుడు ఈ రచయిత్రులను బతిమాలాడాల్సిందే. లేకపోతే ఆ పత్రికకు దిక్కులేనట్లే.

ప్రభంజనం ఆగిపోదు, తాత్కాలికంగా ఆగినా తిరిగి వీస్తుంది
దోపిడీ సమాజం తుడిచిపెట్టుకపోయేదాకా వీస్తూనే వుంటుంది

ప్రభంజనం
రాజకీయ పక్షపత్రిక

త్వరలో తిరిగి ప్రారంభమవుతుంది

వివరాలకు : డాక్టర్ ఎం. వి. రమణారెడ్డి
సంపాదకుడు, ప్రభంజనం, శ్రీరాములుపేట
ప్రొద్దుటూరు - కడప జిల్లా.

బందూక్

(సాహితీ సంకలనం)

మావో ఆలోచనా విధానాన్ని భారతదేశ పరిస్థితుల కనుగుణంగా మలచి,
పీడిత ప్రజానీకవిముక్తికి వర్గశత్రునిర్మూలనా కార్యక్రమాన్ని ఆదేశించిన
చారుశీలి చారు మజుందార్‌కు అంకిత మొసంగబడిన
విప్లవ వ్యాసాలు, కవితల కూర్పు

అనంతపురం చైతన్య సాహితి ద్వితీయ ప్రచురణ

వెల: రు. 1-25 వి. పి. పి. పద్ధతిలేదు

కాపీలు కవలసినవారు పైకం ముందుగా ఎంవో ద్వారా పంపాలి.
ఏజెంట్లు కాపీకి 0-25 పైసల కమీషన్ మినహాయించుకొని
కాపీ 1కి 1-00 చొ॥న ముందుగా ఎంవో ద్వారా పంపాలి.

కాపీలు దొరుకు స్థలం:

సృజన
హనుమకొండ
వరంగల్ - 506001

ముడార్ వేణు
కార్యదర్శి, చైతన్య సాహితి
14-400 కమలానగర్
అనంతపురం

నేటి పోరాట పంథాలో వెలుగే సాహితీ వేదికగా

ఉదయం

సాహిత్య వెలుగులు

ఆర్ట్ లవర్స్
2/32, ఓల్డ్ అల్వాల
సికింద్రాబాద్ - 10

వి. బి. గద్దర్ పాటలు

[ఈ సంచికలోనూ, రాగల వొకటి, రెండు సంచికల్లోనూ ఎక్కువ సంఖ్యలో వేయనున్న వి.బి. గద్దర్ పాటలు త్వరలో పుస్తకరూపంలోకూడ వస్తయి. హైదరాబాదు జిల్లా మాండలికాలు, అక్కడి ప్రజాజీవితం మాత్రమేకాదు- ఈ పాటలన్నీ ఆ చుట్టుపట్ల పల్లెల్లో ప్రజలు పాడుకునే బాణీల్లో వచ్చినవే. కొన్ని పాటలు మకుటాలు, చరణాలుకూడ ప్రజలు పాడుకునే పాటలనుంచే తీసుకొని విప్లవభావాలకు అనుగుణంగా మలచినవి. ఈనాడివి హైదరాబాదు చుట్టూ దాదాపు ఇరవై గ్రామాల్లో విరివిగా పాడుకోబడుతున్నయి. అందరికీ అందుబాటులోకితెచ్చే ఉద్దేశంతో ఇప్పటికే ప్రచారంలోవున్న ఈ పాటలను అచ్చులోకి తెస్తున్నాం.
— సంపాదకుడు]

నీవు నిజం తెలుసుకోవరో!

నీవు నిజం తెలుసుకోవరో కూలన్న
నీవు నడుంగట్టి నడువాలి రైతన్న ॥నీవు॥

పండించేది నీవన్న
బట్టలు నేసేది నీవన్న
నీకు కట్టబోతె బట్టలేదన్న
నీ రెక్కలకష్టం దొచెటోళ్ళ కూలన్నా
బొక్కలు చూరచూరచేయ నడువన్నా ॥నీవు॥

కట్టెలు కొట్టేది నీవన్న
అయ్యో కార్ఖాన నడిపేది నీవన్న
బండలు గొట్టేది నీవన్న
బంగ్లాలు గట్టేది నీవన్న
చలిలో ఎండలో బజారులుంటా వేమన్నా
నీ బతుకులా మన్నూ మన్నూ బోసేదెవరన్నా ॥నీవు॥

దేవుణ్ణి చేసింది నీవన్న
గుడిలో పెట్టింది నీవన్న
శావలు మోసేది నీవన్న
రథాలు గుంజేది నీవన్న
పందిర్లు వేసేది నీవన్న
పల్లకి మోసేది నీవన్న

దేవుణ్ణిచూడ గుడికిపోతె కూలన్నా
నిన్ను గుడిలోకె రానియ్యరేమన్నా ॥నీవు॥

మోటర్లు చేసేది నీవన్న
బస్సులు నడిపేది నీవన్న
బొగ్గులు తొవ్వేది నువ్వన్న
రైళ్ళను నడిపేది నీవన్న
నీవు రోజురోజు నడిచిపోతావేమన్నా
నీవు చేసిందానికి నోచుకోలేదన్నా ॥నీవు॥

నీరెక్కలకు బొక్కలకు కూలన్న
అలసట అసలేలేదన్న
పూట పూటకు కూలన్న
నీకు గంజే కరువాయేమన్న
అందరుగలిసి చేసిన సొత్తును కూలన్నా
కొందరె గుంజుక గుంజుక తింటారేమన్నా ॥నీవు॥

బొందలు తొవ్వేది నీవన్న
బందూకు పట్టేది నీవన్న
మోటర్లు కడిగేది నీవన్న
చాకిరి చేసేది నీవన్న
ఉన్నవాళ్ళకు సేవలుచేస్తే కూలన్నా
నీ చావే దెగ్గరికొచ్చెనోరేమన్నా ॥నీవు॥

దొరలు దొరలు గలిసి కూలన్న
ఊర్లు పంచుకునిరి ఓరన్న
నీ రెక్కల కష్టం కూలన్న
దోచే దొంగలు వీరన్న
నీ కష్టం నీకు చెందేదాక కూలన్న
ఈ దొరలను కరకర కరకర కరకర కోయన్న ॥నీవు॥

ఓట్లను వేసింది నీవన్న
దొరలను చేసింది నీవన్న
ఓట్లతో సుఖము రాదన్న
గొడ్డండ్లు చేత బట్టన్న
ఈ దొరలకు గోరీకట్టె భారం నీదె కూలన్నా
అందుకె ఆయుధాలను చేత బట్టన్న ॥నీవు॥

ప్రజాశక్తి ముందు కూలన్న
ఏ శక్తి నిలువదు వినవన్న
ఆయుధాలు చేత బట్టన్న
అధికారం గుంజుకోవన్న
నీ చేతికి పాలన వచ్చేదాక కూలన్నా
పోరాడు పోరాడు పోరాడు పోరాడు రైతన్నా ॥నీవు॥

రిక్షా దొక్కె రహీమన్న

రిక్షా దొక్కె రహీమన్న
రాళ్ళుగొట్టె రామన్న
డ్రైవరు మల్లన్న
హమాలి కొమరన్న ॥రిక్షా॥

దుక్కిదున్నె దుర్గన్న
మోటగొట్టె మైసన్న
మన్నించి మామాట
వినరో రైతన్న ॥రిక్షా॥

నీకున్న ఆస్తంత రెండు రెక్కలేనన్న
రెక్కలాడకపోతె డొక్కనిండదోరన్న
పొద్దంత పనిలేకుంటె పోయి రాజదోరన్న
జ్వరమొచ్చి మూలకుబడితె కుక్కబతుకె నీదన్న ॥రి॥

యేండ్లుగడిచినగాని యెట్టిదప్పలేదన్న
మంత్రులు మారిన నీ రాత మారలేదన్న
ప్రణాళికలేసిన నీగుడిసె మారలేదన్న
నడ్డిరగ పనిచేసిన వొడ్డితీరలేదన్న ॥రి॥

అప్పులోడింటికొచ్చి ఆలి అక్క అంటడన్న
విషందాగి సచ్చేటి రోజు నీకొచ్చెనన్న ॥రి॥

మర్వాదోందగ్గర నీ ఇల్లు రైనన్న
రేపో మాపోవొచ్చి హరాజు పెడ్తాడన్న
బోకెల్ బొంతల్‌దీసి బైట పారేస్తడన్న
ఇక నీవు బొందలగడ్డకేబోయి బతుకన్న ॥రి॥

జాంగిరు పీర్లకు నువు నాజిజేస్తివోరన్న
కట్టకింది పోచమ్మకు మేకపొతేల్ కోస్తివన్న
ముత్యాలమ్మకు నీవు ముక్కుపోగు వేస్తివన్న
ఏలూరు నాచారం ఎన్నోసార్లు బోతివన్న ॥రి॥

సిగమొచ్చె శివసత్తికి చీరెదెస్తివోరన్న
మంత్రాల మైసయ్యకు బటువేస్తివి నీవన్న
సత్యసాయిబాబకు సారసాక బెడ్తివన్న
చీమలకు పాములకు చెక్కరపాలు బోస్తివన్న
అప్పుపెరిగిందెకాని ఆపద తీరాలేదు
గత్తరొచ్చి నీకొడుకే సచ్చిపోయెనేమన్న ॥రి॥

నీ కష్టాల కన్నిటికి కారణం ఎవడన్న
దేవుడా దయ్యమా లేకుంటే ఖర్మనా
పాపమా పుణ్యమా లేకుంటె పూర్వజన్మ
బాపనోని మాటలింటె బాధదప్ప దొరన్న ॥రిక్షా॥

ఊరపందిల బలసిన ఊరిపెద్దలోరన్న
పచ్చిరక్తంతాగే దొరలూ, భూస్వాములన్న
ఫాక్టరీల యజమానులు దళారీగాళ్ళోరన్న
వీళ్ళ భరతం బడితె నీబాధలు తీరునన్న ॥రిక్షా॥

వాన పడతాది జాన...

(ఒక విప్లవకారుడు చాలా రోజుల తరువాత ఒక రాత్రిపూట భార్యను కలుపడానికై ఇంటికొచ్చినప్పుడు ఆమె ఇలా ఆలాపన చేస్తుంది.)

వాన పడతాది జాన
ఎట్లా బొమ్మందునో
కడుపుకన్నం లేదు
కట్ట బట్టాలేదు
కత్తులు దీసుకొని
కదిలిపోత నంటావు ॥వాన॥

ఎన్నొద్దులాయెనో
నీకు నిద్దురా లేక
ఒక కంటికునుకుదీసి
ఎగిరివారంగెళ్ళు మామో ॥వాన॥

రాకరాకొచ్చావొక
రాతిరుండిపో మామో
కత్తి దెబ్బలకునే మామో
కట్లు గడ్తాను మామో ॥వాన॥

చంటిపిల్లలున్నరు
చనుబాలు లేవు మామో
సావురేవన్నిటికి
సర్దుకున్నాను మామో ॥వాన॥

కూలో సాలో జేసి
పూటెల్ల గొట్టాను
పుస్తె మట్టెలమ్మి
సంటోని చావుజేస్తి ॥వాన॥

ఈ ఊరు దొరోడు
గడిలోకి ఈడ్సుక్కపోయి
నీ జాడ చెప్పమని
ఝాడిచ్చి తన్నిండు ॥వాన॥

సావుకారోడు నన్ను
సంపుక తింటుండు మామో
అమీన్‌సాబోడు నన్ను
ఆడిస్తున్నాడు మామో ॥వాన॥

నిన్ను సాగనంప
నా చేతులురావు మామో
నీ వొడిలో చస్తేనే
నాకు పున్నెము మామో ॥వాన॥

ఈ బాధ పడలేను
ఈ బతుకు నాకొద్దు
బిడ్డాలు పట్టుకొని
నీబాటనె నేనొస్తా ॥వాన॥

కల్లుముంతో మాయమ్మ....

కల్లుముంతో మాయమ్మా - తల్లీ...
నిన్ను మరువజాలనే
కల్లుముంతో మాయమ్మ ॥కల్లు॥

పకోడీలు కబాబులూ పక్కకుంటె సాలుతల్లి
గంజి గట్క దినేటోన్ని గరీబోన్నేతల్లి
మాయమర్మ మెరగనోన్ని మనసులనమ్మేటోన్ని
ధోకబాజోన్నిగాను దొంగలెక్క తాగలేను
లెక్కబెట్టి పైసలిచ్చి నిన్నుదాగుతతల్లో ॥కల్లు॥

సొక్కంమాలు నాకొక్కసుక్క దొరకాదె
కల్లుదుకాన్ల నీవు కల్తిదాని వైతావే
గుల్వారం నీలోగలిపి నన్ను గుమాంచుతారే
లంకపిండి చెక్రీను అదీఇది ఏదేదో
అంతా నీలోకలిపి నన్ను దోచుతరె తల్లో ॥కల్లు॥

సాదాసెప్టీ చిన్నమ్మ- చిన్నమ్మా...
నిన్ను విడువజాలనే
సారాసెప్టీ చిన్నమ్మ ॥సారా॥

నిన్ను పుచ్చుకుంటేగాని నిషారాదె నాతల్లి
నిషాలోన నేను చాల ఖుషీగుంటానే
రేపటిపూట ఫికరుమరిచిపోతనె తల్లి
అప్పులోని బాధమరిచి హాయిగుంటనే తల్లి
పొద్దంతా చేశ్నకష్టం మరిచిపోతనె తల్లి ॥సారా॥

లాడ్జీలు పెట్టి బతికె లంఢికొడుకునుకాను
మంది కొంపలు ముంచె ముండకొడుకునుకాను
ఆలుపిల్లలునోళ్ళెన్ని అన్నదమ్ములునోళ్ళెన్ని
అప్పులెగగొట్టనోన్ని పుట్టెడప్పులునోళ్ళెన్ని
చెమటోడ్చిన పైసలతో నిన్ను దాగుత తల్లో ॥సారా॥

మర్దలుపిల్లో గుడంబ- పిల్లో...
నిన్ను యేసుకుంటనే
మర్దలుపిల్లో గుడంబ ॥మర్దలు॥

అవ్వతోడయ్యతోడు నిన్నువొదులనే పిల్లో
బువ్వలేకున్నాగాని నువ్వే నాతోడుపిల్లో
దూలిపేట నీ తల్లిగారె పిల్లో
తల్లిగారింటికాడ నీపేరు గుడుంబానే
మా బస్తిలో విన్ను జిమురంటారెపిల్లో ॥మర్దలు॥

నిన్నుబట్టె మొగోడింక పుట్టలేదో పిల్లో
నిన్ను తాగినోడుమల్ల మరువలేడే పిల్లో
అబ్కారోనికి నీవు అత్తబిడ్డవేపిల్లో
పోలీసోనికి నీవు పొట్టగంజివేపిల్లో
ఈరాజ్యమేలె సర్కారుకు మారుపేరువేపిల్లో ॥మర్దలు॥

నీ నిషాలుండి నేను నిజం తెలుసుకోలేదే
విన్ననే నావోళ్ళను కలుసుకున్ననే పిల్లో
ఉన్నోళ్ళగుట్టంత తెలుసుకున్ననే పిల్లో
ఓట్లను సీట్లను బూట్లతొ తన్నేటోళ్ళు
భూస్వాముల బయటకీడ్చి కసరుకక్కతొక్కెటోళ్ళ ॥కల్లు॥

గొడ్డండ్లతో కొడవండ్లతో ఊరూర కదిలినోళ్ళు
పరులసొత్తు దోచెటోళ్ళ పారలతో నరికెటోళ్ళు
గవినికుక్కలనంత గావుగావు బట్టెటోళ్ళు
పోలీసోళ్ళనుపట్టి పొతం చేసివేసెటోళ్ళు
పూలమాలలవలె వురితాళ్ళు వేసుకునెటోళ్ళు... ॥కల్లు॥

నువ్వొద్దే నాతల్లి చిన్నమ్మనువ్వొద్దు
ఓ పిల్ల గుడంబ నువ్వు వొద్దెవొద్దు
నా రక్తం పీల్చెటోళ్ళ రక్తం దాగుతపిల్లో ॥కల్లు॥

పుస్తక పరిచయం :

తరుచుగా చదువవలసిన చైర్మన్ మావో మూడు వ్యాసాలు.

చైర్మన్ మావో మూడు చిన్న వ్యాసాలు: (1) ప్రజలకు సేవచేయండి (2) తెలివిమాలిన వృద్ధుడు పర్వతాలను ఎలా తొలగించాడు? (3) కామ్రేడ్ నార్మన్ బెథూన్ జ్ఞాపకార్థం- ఈ మూడు వ్యాసాలను తరుచుగా చదువవలసిన చైర్మన్ మావో మూడు వ్యాసాలు (Chairman Mao's three constantly read articles) అని పిలుస్తారు.

ఈ మూడు వ్యాసాలను చైనా ప్రజలు ఆబాలగోపాలం అనునిత్యం చదువుతారు. అధ్యయనం చేస్తారు. తమ నిత్యజీవితానికి అన్వయిస్తారు.

భారతదేశ విప్లవ కార్యకర్తలుకూడా ఈ వ్యాసాలను తరుచుగా చదువుతున్నారు. రైతాంగ ప్రజలకు తరుచుగా వినిపిస్తున్నారు. ఈ మూడు వ్యాసాలూ "ప్రజలకు సేవ చేయండి"అనే పేరుతో ఇప్పుడు తెలుగులో ప్రచురించబడటం వలన యీ వ్యాసాలను అందించే విప్లవ సందేశం తెలుగు దేశంలోని మారుమూలలకుచేరే అవకాశం ఏర్పడింది.

కామ్రేడ్ చాంగ్ జూ-తే అనే పార్టీ కార్యకర్త చనిపోయినపుడు ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన స్మారకసభలో చైర్మన్ మావో చేసిన ప్రసంగం, "ప్రజలకు సేవచేయండి". "ప్రజల ప్రయోజనాలకొరకు మరణించటం థాయ్‌శిఖరంకన్న బరువైనది. అలాగాక ఫాసిస్టులకొరకు, ప్రజలను దోపిడిచేస్తూ పీడించేవారికొరకు కష్టపడి పనిచేయటం, మరణించటం హంస ఈకకన్న తేలికైనది" అని చైర్మన్ మావో అంటారు. విప్లవ రాజకీయాలు త్యాగపూరిత రాజకీయాలు. ఈ రాజకీయాలనే మన ప్రియతమ నాయకుడు కామ్రేడ్ చారుమజుందార్ వుపదేశించారు. ఈ త్యాగపూరిత రాజకీయాలను చూచి రివిజనిస్టులు బెదిరిపోతున్నారు. స్వీయభద్రతా రాజకీయాలను జెండాగా చేతబట్టుకొని ఊరేగుతున్నారు. విప్లవ పోరాటం పొందిన తాత్కాలిక అపజయాలను గోరంతలు కొండంతలుచేసి ప్రచారం చేస్తున్నారు. అన్ని తరహాల రివిజనిస్టులకు పోరాటంకన్న లొంగుబాటే తియ్యనైనది. విద్రోహమార్గమే విప్లవ మార్గంకన్న ఆకర్షణీయమైనది. అందువల్లనే పోరాడుతున్న ప్రజల్ని నిరుత్సాహపర్చి, నిస్పృహలో పడవేయటానికై రివిజనిస్టులు ప్రతి విప్లవం డిమాండ్‌చేసే బాధలు, కష్టాలు, మరణాలకు సంబంధించిన విషాద దృశ్యాలనే ఎల్లప్పుడూ చిత్రిస్తూ

వుంటారు. కానీ విప్లవకారులు మాత్రమే ప్రదర్శించగల్గిన మృత్యువునుసైతం ధిక్కరించే సాహసాన్ని, పూర్తి నిస్వార్థతను వీరోచితమైన ఆత్మత్యాగాన్ని వారు ప్రదర్శించలేరు. ఈ వ్యాసంలో చైర్మన్ మావో మనకిలా వుపదేశించారు: "కష్టకాలాల్లో మన విజయాలను గుర్తుచేసుకోవాలి; విషయాలకు సంబంధించిన వెలుగుముఖాన్ని చూడగలిగి వుండాలి."

చైనా కమ్యూనిస్టుపార్టీ 7వ మహాసభ రూపొందించిన పంథాను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకొని పోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ చైర్మన్ మావో చేసిన ప్రసంగమే "తెలివిమాలిన వృద్ధుడు పర్వతాలను ఎలా తొలగించాడు?" అనే వ్యాసం. చైర్మన్ మావో యిలా ఉపదేశించారు: "అగ్రగామిదళాన్ని మేల్కొల్పాలి. వారిని ఆవిధంగా కృతనిశ్చయంతో త్యాగం అంటే భయపడకుండా అన్నిరకాల యిబ్బందులను అధిగమించేటట్లుగాను, విజయం కొరకు కృషిచేసేటట్లుగాను చేయాలి... చైనా దేశం చైనా ప్రజలదేగాని అభివృద్ధి నిరోధకులది కాదనే నమ్మకాన్ని దేశవ్యాపితంగా గల ప్రజల్లో మనం కలుగజేయాలి". ఈ కథలోని తెలివిమాలిన వృద్ధునివలె విప్లవకారులు పట్టుదలగాను, నిరంతరంగాను పనిచేయాలి. అప్పుడే మనంకూడా "దేవుడి" హృదయాన్ని కదిలించగలుగుతాం. ఆ దేవుడు మరెవరోకాదు. మనదేశంలోని సామాన్య ప్రజలే ఆ దేవుడు. ప్రజలుకూడా లేచి నిలబడి తీవ్రంగా ప్రారంభించారంటే యీ దోపిడీ పర్వతాలను నిర్మూలించగలం. కామ్రేడ్ చారుమజుందార్ మావో ఆలోచనా విధానాన్ని మనదేశ నిర్దిష్టపరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించారు. భారతవిప్లవకారులు రాజకీయాధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే విప్లవ రాజకీయాలలో ప్రజల్ని ఉత్తేజపరిచారు. వర్గశత్రు నిర్మూలనద్వారా గెరిల్లాపోరాటాన్ని ప్రారంభించారు. ప్రజా సైన్య నిర్మాణానికీ, విప్లవస్థావరాల నిర్మాణానికి బాటలు వేశారు. ఈకథలో "తెలివిగల ముసలివాడు" రివిజనిస్టులను గుర్తుకుతెస్తాడు. ఈ రివిజనిస్టులు తెలివిమాలిన వృద్ధునిలా పట్టుదలగాను నిరంతరాయంగాను విప్లవ కార్యక్రమాన్ని కొనసాగించజాలరు. ఈ తెలివిగల ముసలివాళ్ళు విప్లవకారుల్ని "దోపిడి పర్వతాన్ని తవ్వుతారా?" అని అవహేళన చేస్తున్నారు. గెరిల్లా పోరాటానికి పోటీగా పార్టీ నిర్మాణం, ఐక్యసంఘటన నిర్మాణం తీసుకొస్తున్నారు. వర్గ శత్రు నిర్మూలన రహస్యకుట్రపద్ధతి అని తెగనాడుతున్నారు. సాయుధ పోరాటం, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవటంతో సంబంధంలేనిదిగా వ్యవసాయ విప్లవాన్నిగురించి ప్రస్తావిస్తున్నారు. వ్యవసాయ విప్లవాన్ని బూర్జువా ప్రచారకులు చేసే "ఆకుపచ్చ విప్లవం"లా వర్ణిస్తున్నారు. వర్గ శత్రు నిర్మూలన వర్గపోరాట అత్యున్నతదశ; గెరిల్లా పోరాట ప్రారంభదశఅని విప్లవ

కారులు గుర్తిస్తున్నారు. ప్రజాసైన్యంలేనిదే ప్రజలకు ఏమీలేదనీ, వ్యవసాయక విప్లవం లేదనీ విప్లవకారులు గుర్తిస్తున్నారు. విప్లవ పోరాట జ్వాలలనుండే విప్లవ పార్టీ, ఐక్యసంఘటన బలపడి విస్తృతమవుతాయని వారికి తెలుసు.

మూడో వ్యాసం "కామ్రేడ్ నార్మన్ బెతూన్ జ్ఞాపకార్థం" ఒక కెనడాదేశ డాక్టర్ చైనాదేశం వెళ్ళి, అక్కడ ప్రజావిముక్తి పోరాటంలో పాల్గొనటం, అక్కడే తన ప్రాణాలను అర్పించటం- ఈ దీక్ష ఎలాంటిది? ఇది విప్లవకారులకుండవలసిన అంతర్జాతీయదీక్ష. చైర్మన్ మావో ఈ వ్యాసంలో కార్మికవర్గ అంతర్జాతీయ ప్రాముఖ్యత గురించి వివరిస్తారు.

కామ్రేడ్ చారుమజుందార్ ఈ శాస్త్రీయదృక్పథం నుండే మన జాతీయ, అంతర్జాతీయ ప్రయోజనాలు ఒక్కటేనని ప్రకటించారు. భారత విముక్తిపోరాటాన్ని సాగించటంద్వారా, జయప్రదం చేయటంద్వారా ప్రపంచ విప్లవ కేంద్రమైన జనచైనాకు వ్యతిరేకంగా భారత గడ్డపై జరిగే కుట్రలను భగ్నం చేయగలమని ఆయన ప్రకటించారు. భారత విప్లవకారులు అంతర్జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేశారు. ప్రపంచ విప్లవ అధినేత చైర్మన్ మావో మా చైర్మన్ అని ప్రకటించటంద్వారా జాతీయ దురహంకారానికీ, సంకుచిత తత్వానికి చావుదెబ్బ కొట్టారు. రివిజనిస్టులు ఈ నినాదం భారత కార్మికవర్గం జాతీయభావాన్ని (?) గాయపరిచిందని అంగలారుస్తున్నారు. ఈ గుంట నక్కలకు భారత కార్మికుల్లో గాయపడ్డ జాతీయభావం కనిపిస్తున్నదట; కాని వారిలో విజృంభిస్తున్న విప్లవ పెనుతుఫాను కనిపించటం లేదు. కార్మికులకు దేశాలు, దేశ సరిహద్దులులేవు. ఈ మధ్యేమార్గవాదులు "ప్రపంచ కార్మికులారా, ఏకంకండి" అనే నినాదంలోని విప్లవ అంతర్జాతీయతను మర్చిపోతున్నారు. ఈ వ్యాసంలో చైర్మన్ మావో యిలా అంటారు: "మన సొంతంకోసం ఏమీ చేసికోకుండా ప్రతి పనీ ఇతరుల ప్రయోజనాల కొరకు చేసేవారు... స్వార్థం నుండి పూర్తిగా విముక్తిచెందిన ఆ దీక్షను మాత్రం కలిగివున్నట్లయితే అతను అప్పటికే ఉన్నతాదర్శాలుగల మనిషిగానూ. నైతిక స్థాయిగల మనిషిగాను, తుచ్ఛమైన కోర్కెలను అధిగమించిన మనిషిగాను ప్రజలకు ప్రయోజనకరమైన మనిషిగాను ఎదిగినట్లే".

భారత రైతాంగ పోరాటంలోకూడా స్వార్థాన్ని జయించిన నూతన మానవుడు ఉద్భవిస్తున్నాడు. వర్గశత్రు సంహారక విప్లవ యుద్ధం నుండి ఉదయిస్తున్న ఈ నూతన మానవుడే భారత విప్లవ విజయానికి నమ్మకమైన హామీ.

ఈ చిన్న పుస్తకంలో "క్రమశిక్షణకు సంబంధించిన మూడు ప్రధాన విషయాలు" "జాగ్రత్త వహించవలసిన ఎనిమిది అంశాలు" చేర్చటం ముదావహం.

భారత విప్లవం జయప్రదం కావాలంటే మావో ఆలోచనా విధానాన్ని విరివిగా ప్రచారం చేయవలసిన అవసరం ఎంతైన వుంది. చైర్మన్ మావో రచించిన ఈ మూడు వ్యాసాలు తెలుగులో అనువదింపజేసి, ప్రచురించిన "సోషలిస్టు పబ్లికేషన్స్" వారు అభినందనీయులు.

అనేక కష్టాలను ఎదుర్కొంటూ మావో సూక్తులను రెండుసార్లు తెలుగులో ముద్రించి, అలాగే మావో "ప్రజాయుద్ధం" అనే రచనను తెలుగులో ప్రచురించి యింకా ఎంతో విప్లవ సాహిత్యాన్ని ప్రచురించిన "సోషలిస్టు పబ్లికేషన్స్" ఆంధ్ర ప్రచురణ రంగంలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నది. పాకెట్ సైజులో ప్రచురించిన "ప్రజలకు సేవచేయండి" అనే చిన్న పుస్తకం తరుచు చదువవలసింది; అధ్యయనం చేయవలసింది; జీవితాన్ని అన్వయించవలసింది; ప్రతి ఒక్కరు స్వంత కాపీ వుంచుకోవలసింది.

— క్రాంతి కుమార్

ప్రజలకు సేవచేయండి

వెల : 50 పైసలు — చైర్మన్ మావో

ప్రతులకు: సోషలిస్టు పబ్లికేషన్స్
పెనుమాక, గుంటూరు జిల్లా.

సవరణ

విరసం మూడవ మహాసభల ప్రత్యేక సంచిక

వెల : రెండు రూపాయలకు పెంచబడింది.

ఎన్ ఎస్ స్మృతి:

ఎన్. ఎస్. ప్రకాశరావు

జననం : 18-12-1947
మరణం : 14-6-1973

రెండు నెలలక్రితమే ఆదర్శ వివాహం— వధువు నళినికూడ విరసం సభ్యురాలు. కథలు రాస్తుంది. విరసం సభ్యురాలు కృష్ణాబాయి కూతురు. కుటుంబమే విరసం కుటుంబం.

ప్రకాశరావు కెమికల్ ఇంజినీరింగ్‌తో ఎం.టెక్ పాసయి పి.ఎచ్.డి. చేస్తున్నాడు. విశాఖ రచయితల సంఘానికి చాలకాలం కార్యదర్శి. ఎన్. ఎస్. కథలు మంచి, ఏకరువు సృజనలో వచ్చినవి. పేపర్ టైగర్— హోరు ఇపుడు వీస్తున్నగాలి స్వాతిలో వచ్చింది. మరోకథ ఫ్రెండ్స్. విప్లవ కథల చర్చలో ఎప్పుడూ తప్పక హాజరు. తెలుగు వాతావరణానికి యిమిడేలా విశాఖ మాండలికంలో 'ఉప్పెన' అనువాదం.

ఉప్పెన

బయినెట్ గుండెలో పొడుస్తున్నట్టుగా ఎన్ ఎస్ చనిపోయినవార్త ఎంతకీ నమ్మకం కుదరదు. సముద్రం చచ్చిపోతుందా. నమ్మలేము. వొడ్డున విరిగిపడే సముద్రంలాగ ఆరాటపడే నిరంతరంగా హోరుపెట్టేశక్తి. శ్రమజీవుల మనసుల్లో ఆ వర్గం రచయితల గుండెల్లో తలుపుల్నీ కిటికీలనీ తెరుస్తున్న చైతన్యం. జాలరిపేట పడవల్లో జనం సముద్రంలోకి పోయి సాహిత్య పరిశోధనలు చేసిన ఉప్పెన. స్నేహ వెల్తురుకింద మార్క్సిస్ట్ లెనినిస్ట్ జన విశ్వవిద్యాలయంలో సమాజం కథలు చదువుకుంటున్న ప్రకాశం. ప్రియమైన మా స్నేహితుడు ఎన్ ఎస్.

గుండెలోనించి ఒక్కొక్కటిగా నెత్తురుచుక్కలు మనసుమీద రాలుతున్నప్పుడు, మనసులోని కన్నీరు కట్టలు తెంచుకుని చూపులు వెలుగుని కప్పేస్తున్నప్పుడు, ఏడుస్తున్న అప్తుల గుండెలకు మాత్రం విన్పించే పలుకులు— ఉప్పెన పూర్తి చేయమని వెలుగువేపు బాట చూపిస్తాయి.

* * *

(ఇట్లా నేను ముగిస్తే గుండె అడుగుతోంది
స్నేహితుడా మళ్ళీ ఎప్పుడొస్తావు మావూరు
మావూళ్ళో నిన్నుచూసిన నీతో మాటాడిన వాళ్ళంతా అడుగుతున్నారు
ఎప్పుడొస్తావు చెప్పు— వాళ్ళకి చెప్పాలి నేను)

— శ్రీపతి

సాయుధ హేతువాది

ప్రముఖ యువరచయిత, యువశాస్త్రజ్ఞుడు, విప్లవ రచయితల సంఘ సభ్యుడు ఎన్.ఎస్. ప్రకాశరావు ప్రమాదవశాత్తు అకాలమరణానికి గురికావటం చాలావిచారకరం. ప్రకాశరావు విప్లవ దృక్పథం, శాస్త్ర జ్ఞాన దృష్టి యువతరానికి మార్గదర్శకాలైనవి. విశాఖలో శ్రీశ్రీ షష్టిపూర్తినుంచి విరసం ఏర్పడటానికి, అభివృద్ధి చెందటానికి కృషి చేసిన యువకుల్లో ప్రకాశరావు ముందుపంక్తిలో నిలబడ్డాడు. పెద్ద శాస్త్రజ్ఞులనిపించుకున్నవారు బాబాల, సన్యాసుల పాదధూళి సేవిస్తుండేరోజుల్లో టెక్నాలజీకో పరిశోధన చేస్తున్న ప్రకాశరావు హేతువాద ఆయుధంతో జీవితంలో రాజీలేని పోరాటం చేశాడు. తన ఆశయాల్ని ఆచరణలోకి ప్రసరింపచేయటం కోసం నిరంతర కృషిచేసిన యువ మేధావి. వర్ణాంతర వివాహం చేసుకొని రెండు నెలలైనాకాలేదు. సృజన పత్రికలో సీరియల్ నవల యింకా పూర్తికాలేదు. ఉత్సాహమూర్తి ప్రకాశరావు మరణం విప్లవ రచయితల సంఘానికి తీరనిలోటు. అతని కుటుంబానికి, బంధువులకు విప్లవ రచయితల సంఘం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

— త్రిపురనేని మధుసూదనరావు
విరసం కార్యదర్శి

విప్లవ కెరటం

ఈ వర్గ వ్యవస్థ ప్రసాదించే చదువులు ఎంతమంది చదవడంలేదు? చదివిన ఎంతమంది ప్రజాసమస్యల పరిష్కారానికి తమ చదువును, జీవితాన్ని అంకితం చేస్తున్నారు? ప్రజా ప్రయోజనాలకి, తనగళాన్ని, కలాన్ని అంకితంచేసిన మా ఎన్.ఎస్. ప్రకాశరావు టెక్నాలజీలో పరిశోధనచేస్తూ, హేతువాద దృక్పథంతో, శాస్త్రీయవిశ్లేషణతో జీవితంలో రాజీలేని పోరాటంచేసినవాడు. నేడున్న ఈ వ్యవస్థ మారాలంటే అనివార్యంగా సాయుధపోరాటం ఏకైకమార్గమని నమ్మి, ప్రజని సాయుధం చేయటానికి పూనుకున్న రెవల్యూషనరీ మా ఎన్.ఎస్. ఎక్కడ ఏ తిరుగుబాటులేచినా విప్లవకెరటం ఎగసినా జనహృదయాలతో స్పందించి శాస్త్రీయ విశ్లేషణ జరిపేవాడు. క్రాంతిబాటకు పోరాటకాగడా పట్టేవాడు. కవితా ప్రగతిలోనూ, కథాసృజనలోనూ, అనువాదవిధానంలోనూ మా ఎన్.ఎస్. వర్తమాన సాహిత్యంలో విప్లవకెరటం. భౌతికదృష్టితో పురోగమించే ఎన్. ఎస్. ఆచరణాత్మక విధానాలు, ఈ యుగద్వారాలుతట్టే యువతరానికి

మార్గాలు. పీడితులపట్ల ఎన్. ఎస్.కి గల ప్రగాఢ సానుభూతి, విశ్వాసం, ఆయన నిర్మలమైన నవ్వు, కార్యక్రమాల్లో క్రమశిక్షణ అనుక్షణం వుత్తేజితాలు. ఈ సమాజంలో తన కర్తవ్యం పూర్తికాకమునుపే మృత్యువువాతబడ్డ మా సహచరునిపట్ల ప్రగాఢ సానుభూతిని ఈ అక్షరాల్లో యిమడ్చలేక యిముడుస్తున్నాము.

భూషన్
కన్వీనర్,
వి ర సం శాఖ, తిరుపతి.

విప్లవ జోహార్లు

విప్లవ రచయితల సంఘం సభ్యుడు, ప్రముఖ కథారచయిత కామ్రేడ్ ఎన్ఎస్ ప్రకాశరావు మృతి విప్లవకథా సాహితీలోకంలో తీరని లోటని, ఆయన మృతికి విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని విప్లవ రచయితల సంఘం, గుంటూరు శాఖ తన ప్రకటనలో తెలియజేసింది.

— వి ర సం, గుంటూరు.

'మంచి' కథకుడు

ప్రకాశరావ్‌గారికి అరుణసాహితి జోహార్లు!

మంచి కథలకు మారుపేరు. మంచి ప్రతిభాశాలి. మాష్టర్ ఆఫ్ టెక్నాలజీ పట్టభద్రుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రీసెర్చి చేస్తున్న మేధావి విప్లవరచయితల సంఘ సభ్యుడు అయిన శ్రీ ఎన్.ఎస్. ప్రకాశరావుగారి మృతికి 'అరుణ సాహితి' తన ప్రగాఢసంతాపాన్ని ప్రకటిస్తూంది. ఈ దేశంలో దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారానే సమసమాజం సిద్ధిస్తుందన్న గాఢమైన నమ్మిక కలవాడు, అదేవిధమైన చైతన్యంతో సాహిత్యకృషి చేస్తున్న రచయిత హటాత్తుగా పేలుడు ప్రమాదానికిలోనయి మరణించారు. ఆయన జనంకోసం రాసిన "మంచి"కథను 'అరుణ సాహితి' ప్రథమ ప్రచురణ"జనం"లో ప్రచురించి జనానికి అందించిన అరుణ సాహితి శ్రీ ప్రకాశరావు గారికి జోహార్లు అర్పిస్తుంది.

— అరుణ సాహితి
హైదరాబాద్

నవతరం కథకుడు

మిత్రులు ఎన్.ఎస్. ప్రకాశరావు టెక్నాలజిస్టుగా కార్యనిర్వహణలో అందరిని విడిచి హఠాత్తుగా యిలా వెళ్ళిపోతారని కలలోకూడా ఊహించలేదు. నవతరానికి చెందిన శక్తివంతుడైన కథారచయితను, విస్పష్టమైన విప్లవ అవగాహనకలిగిన సభ్యున్ని విరసం కోల్పోయింది. 'ఉప్పెన' అనువాదకుడిగా– మంచి కథారచయితగా ఎన్.ఎస్.ను ఏనాటికి మరచిపోలేము. ఆయన కుటుంబానికి నా హృదయగతమైన సంతాపాన్ని తెలియజేస్తున్నాను"

— నిఖిలేశ్వర్

నీ పని పూర్తికాకుండా నే....

ఎన్వీ

కామ్రేడ్ యన్. ఎస్.
ఉత్సాహం చచ్చిన
నీరస వాతావరణ
హైదరాబాద్ విరసం సభల్లో
కథాగోష్ఠిపై నీ ప్రసంగం
ఉత్సాహానికి ఊపిరిపోసింది
హృదయాలనిండ ఉత్తేజాన్ని నింపింది.

మార్క్సిస్టు రచయిత కానివాడు
వాస్తవికత చెప్పలేడా? అనే
గమ్యంచేరుకోలేని
గందరగోళపు ప్రశ్నలకునైతం
వర్గసమాజంలో వాస్తవికతకు
బారోమీటర్ మార్క్సిజమని

సూక్ష్మమైన సమాధానంతో
(తెలిసి, విని, అడిగికూడ
అడగటం ఒకఅలవాటై
వినిపించుకోకుండ
ప్రశ్నిస్తున్న ప్రశ్నలకు
గడచిన రెండు దశాబ్దాలు
అడుగాల్సిన పాత ప్రశ్నలంటూ)
నోరుమూయించగలగే నీ చతురత.

నీ ప్రతి చర్యలోను
మూర్తీభవించిన మిలిటెన్సీ
అపరిచితులను సైతం
పరిచయస్తులను చేసుకునే
కలుపుగోలుతనం, మంచితనాన్ని
మెత్తనైన నీ సువిశాలహృదయాన్నిగూర్చి
నగరంలోని ప్రతిగుండె
ఆశగా నీకై చూచిన
అడవిలోని ప్రతిచెట్టు
కథలుగా చెప్పుకుంటున్నాయ్ నేస్తం.

పుక్కిటి పురాణాల
అమ్మమ్మ కథల బ్రహ్మజెముడు
అజ్ఞానం మూఢవిశ్వాసాల
ముండ్లపొదల నరికేసి
సామ్యవాద ఎర్రమందార
కథల విత్తనాలు చల్లావు
నవకథా జగత్ నిర్మించి
సమతా సాహితీ విలువలు సృష్టించేవునేస్తం.

అమెరికా సామ్రాజ్యవాదం
వియత్నాం గెరిల్లాపై ప్రయోగించిన
యాంత్రికహింసలా
తన అస్థిత్వానికి నీళ్లవస్తాయనే
భయంతో, పిరికితనంలో
ఈ దోపిడీవ్యవస్థ
పరోక్షంగా
ఎంత అనాగరికంగ
ఎంత అమానుషంగ
నీ కండ్లు, ముక్కు
చెవులు, చేతులను
కాల్చి, మాడ్చి
నీకున్న వర్గకసినికొలచి
ఈ వ్యవస్థ ఎంతకసి తీర్చుకొందినేస్తం.
మరణవేదనలో సైతం
ఈ దోపిడీ స్వామ్యాన్ని ధ్వంసంచేయాలన్న
నీ సాహసోపేత సందేశం
మమ్ముల కర్తవ్య నిర్వహణకు
కార్యోన్ముఖులను చేస్తున్నది
ఈ దోపిడిని చితవధచేసి
కసిదీర అంగాంగంనరికి
మన అంతిమ ఆశయంవైపు
ఆగకుండ ఆవైపే నడుస్తాం.
ఈ వ్యవస్థను చేయనున్న చిత్రవధలో
నీ వంతు వర్గకసిని
తీర్చుకోకుండానే
పోయావయ్యా ఎన్. ఎస్.

మావోవాడా మావాడా

చెరబండరాజు

విశాఖలో గాలి మూగబోయింది
కఠినశిలగా సముద్రం ఘనీభవించింది

నీలోని 'ప్రజలమనిషి'ని పసిగట్టి
ప్రాణమిత్రుడిగా పదిలంగా
గుండెల్లో హత్తుకున్నాను

ఎంతదారుణం జరిగిందయ్యా
ఎందరి గుండెలు బండబారినాయయ్యా

నిన్నగాక మొన్ననేగదా తెనాలిలో
పక్కపక్కనే నువ్వూనేనూ అక్కయ్యాకూర్చొని
చెక్కభజనగాళ్ల గురించి చెప్పుకున్నాం

'ఉప్పెన' పూరించడానికే
విశాఖ వెళ్తున్నానన్నావ్

యువతరానికి ఆశాకిరణంగా నిప్పుపూవుగా
కలంపట్టి మెరిసినవాడా
ఎక్కడనయ్యా ఇప్పుడు కథలు రాస్తున్నావ్
ఎవరితోనయ్యా
రాయబోయే కథలగూర్చి చర్చిస్తున్నావ్.

నిండుగా నవ్వేనీలో చంద్రుణ్ణీ
నిప్పులామండేనీలో సూర్యుణ్ణీ చూసుకొని
ఎంతగా మురిసిపోయేవాణ్ని.

విశాఖ సముద్రంలా
నళిని హృదయం
చీకట్లో రోదిస్తున్నది.

ఎందరాత్మీయులు
ఎందరెందరాప్తులూ మిత్రులూ
రక్తాశ్రువులు రాల్చుతున్నారో చూస్తున్నావా

మనిషి బతికున్నప్పుడు
మంచేమిటో తెలియని సమాజం మనది

కవిత్వంలోతప్ప ఏడ్వలేనివాడికి
జీవితంలోని కాఠిన్యమూ కారుణ్యమూ
ఏవీ సొంతం అర్థంకాదులాగుంది

ఏ ఆశా ఫలించకముందే
నీ పచ్చని జీవితం
కాలిపోయి ఈథర్‌లో కలిసిపోయింది.

పుట్టుక ఒక ఆలోచన చిగురించడం
చిగురు మారాకు వేయాలి
మాడిపోతే మనసు వాడిపోతోంది.

శాస్త్రీయ పరిశోధనలో
ప్రమాదవశాత్తు ప్రయోగం మధ్యలో
ప్రాణాలు కోల్పోయినవాడా
మావోవాడా మావాడా.

మరణించినవాణ్ణే
మంచితనం
మనుషుల్లో వెతికిస్తుంది
మనసులో బతికిస్తుంది.

SRJANA Telugu Monthly **July '73** **H-1088**
Regd. No. with Registrar of News Papers of India 10953/67

భారత పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు
చారు మజుందార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా
ఆయన స్మృతికి అంకితమవుతూ

పిలుపు

1-8-73 నాటి సంచిక
జన్మదిన ప్రత్యేక సంచికగా
జులై 28 నాటికి వెలువడుతుంది.

గత ముప్పయి సంవత్సరాల
కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో
వర్గశత్రు నిర్మూలన పాత్ర — ఎస్. విశ్వేశ్వరయ్య

హిందూ మహాసముద్రంపై
బ్రిటీష్ రష్యా ఆధిపత్యం — కె. వి. రమణారెడ్డి

పై వ్యాసాలే కాకుండా

నక్సల్‌బరీ, భీర్‌భమ్, శ్రీకాకుళం వగైరా సాయుధ పోరాటాల గురించి విశ్లేషణాత్మకమైన, విమర్శనాత్మకమైన వ్యాసాలు; కథలు, కవితలతో వెలువడుతుంది.

వెల ఒక్క రూపాయి మాత్రమే

ఏజన్సీలకు :

1) బకాయిలున్న ఏజన్సీలకు ఈ ప్రత్యేక సంచిక పంపబడదు.
2) 25% కమీషన్ తగ్గించుకొని జులై 25 కల్లా అందేలాగ కావలసిన కాపీలకు డబ్బులు పంపాలి. వి. పి. సౌకర్యం కలదు.

పాఠకులకు :

జులై 26 కల్లా అందేలాగ నేరుగా 1 రూపాయి పంపి మీ కాపీని నేరుగా పొందండి.

ఎడిటర్, పిలుపు
15-1-1/61 సీతారాంబాగ్
హైదరాబాద్ 500001